
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు





వరదలా వాన!

4 గంటల పాటు ఏకధాటిగా వర్షం





రాజమహేంద్రవరంలో వర్షంలోనే వాహనదారుల ప్రయాణం

కలెక్టరేట్	89779 35611
ఆర్డీవోరాజమండ్రి	0883 2442344
కార్పొరేషన్	94940 60060
ఆర్డీవో కొవ్వూరు	08813 231488
మునిసిపాలిటీ	08813 231557

రాజమహేంద్రవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వరుణుడు దంచికొట్టాడు.. కరువుతీరా ముంచేశాడు.. వర్షాకాలమైనా గత నెల రోజులుగా సరైన వర్షాల్లేవ్..మరో పక్క తీవ్ర ఎండలతో జనం ఆపసోపాలు పడ్డారు. ఇదిలా ఉండగా ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరానికి సమీపంగా అల్పపీడనం ఏర్పడడంతో ఈ నెల 13, 14 తేదీల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం సమయంలో భారీ వర్షం కురిసింది. వర్షాకాలం అయినప్పటికీ జూలై, ఆగస్టు నెలలో పెద్దగా వర్షాలు పడలేదు. ఆకాశం మబ్బులు కమ్మినప్పటికీ కొద్ది పాటి చినుకులుతోనే గడిచిపోయింది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 7 గంటల వరకు ఎడతెడపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎండలతో సతమతమైన ప్రజానీకం వాతావరణం చల్లబడడంతో సేద తీరారు. వానాకాలంలో చినుకు రాక కోసం ఎదురు చూస్తున్న జనాలకు ఉపశమనం కలిగింది. వర్షాకాలం ప్రారంభమైనా చెదురుమదురు తప్ప పెద్దగా వర్షం కురిసిన దాఖలాలు లేవు. ఆ వాన కూడా ఒక ప్రాంతంలో ఉంటే మరో ప్రాంతంలో ఉండేది కాదు. అయితే బుధవారం ఉదయం ఎండ కాసినా మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా చల్లబడింది. జిల్లా వ్యాప్తంగా భారీగానే వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ప్రశాంతి ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు. ఏటి గట్లు, లోతట్టు ప్రాంతాలు, విద్యుత్ స్తంభాలు వంటి వాటి వద్ద అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాల్లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు రాజమండ్రి, కొవ్వూరు ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. మూడు షిఫ్టుల్లో ఉద్యోగులు నిరంతరం విధులు నిర్వర్తించే విధంగా చర్యలు తీసుకున్నారు. విపత్తు నిర్వహణ శాఖ సాధనా సంపత్తిని సిద్ధం చేసుకొంది.వ్యవసాయ అధికారులు అప్రమత్తమయ్యారు. గోదావరి లంకల్లోని నివాసితులను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో జరగాల్సిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మరో సురక్షితమైన వేదికలో నిర్వహించడానికి అధికారులు పరిశీలన చేస్తున్నారు. మరోవైపు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. అవసరం లేకపోతే బయటకు రాకుండా ఉండాలన్నారు. పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. జిల్లా యంత్రాంగానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వర్షాల వల్ల ప్రజలకు సమస్యల ఏర్పడితే వెంటనే వారి పరిధిలోని కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం కురిసిన జోరు వానకు జిల్లా కేంద్రంలోని రోడ్లు నీటితో నిండిపోయాయి. కంబాల చెరువు,తాడితోట, తుమ్మలావ, ఆర్యాపురం ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

పది మండలాల్లో కంట్రోల్ రూమ్‌లు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పది మండలాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకూ వర్షాలు, గాలులు వంటి వాతావరణ పరిస్థితులు, మార్పులను దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సాయం అందించేందుకు కంట్రోల్ రూమ్‌లు 24 గంటలు సిద్ధంగా ఉంటాయన్నారు. ప్రజలు ఏ అవసరం వచ్చినా కంట్రోల్ రూంలను సంప్రదించవచ్చని తెలిపారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం 0883-2442344, అనపర్తి 94413 86920, బిక్కవోలు 98499 03913, గోకవరం 9491380560, కడియం 94908 84561, కొవ్వూరు 9866778416, రాజమహేంద్రవరం రూరల్ 0883 2416005, రాజమహేంద్రవరం అర్బన్ 0883 2940 695,రాజానగరం 94945 46001, రంగంపేట 91778 24924, సీతానగరం 9177096888 నెంబర్లలో సంప్రదించాలన్నారు.



బ్యాంకర్లు 18 నుంచి రుణమేళాలు నిర్వహించాలి

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం రూరల్, (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లోను ఆగస్టు 18వ తేదీ నుంచి సీసీఆర్సీ కార్డుదారుల రుణమేళా నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో సీసీఆర్సీ కార్డులు కలిగిన కౌలు రైతులకు రుణాల మంజూరు విషయమై బ్యాంకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రుణమేళాల ద్వారా సీసీఆర్సీ కార్డు కలిగిన ప్రతి కౌలు రైతుకు ఖచ్చితంగా పంట రుణం అందించాలన్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 1.10 లక్షలు సీసీఆర్సీ కార్డులను అందించాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 57,107 కార్డులు మంజూరు చేశామన్నారు. వీరిలో ఇప్పటి వరకు 3,438 మంది రైతులు మాత్రమే పంటరుణాలు పొందారన్నారు.సీసీఆర్సీ కార్డుదారుల వివరాలను వ్యవసాయాధికారులు సంబంధిత బ్యాంకర్లకు అందించాలని ఆదేశించారు. రానున్న రెండ్రోజుల్లో పంట రుణాలకు దరఖాస్తులు పూర్తిచేసేందుకు క్షేత్ర స్థాయిలో వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సహాయకులు బాధ్యత వహించాలన్నారు. వ్యవసాయాధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి రోజూ కలెక్టర్ లేదా జేసీ, నోడల్ అధికారులు వ్యవసాయాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తామన్నారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద రాయితీపై సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకునేవారికి రుణాలు మంజూరుచేయాలన్నారు.



కూర్చుని.. తాగండి!

మద్యం షాపులకు పర్మిట్ రూమ్‌లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం మద్యం షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎక్సయిజ్ చట్టంలోని సెక్షన్ 24 (ఏ)ను అదనంగా చేర్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పలు రాష్ట్రాల్లో అధ్యయనం తర్వాత కొత్త మద్యం పాలసీని అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేటు మద్యం షాపులకు అనుమతిచ్చింది. జగన్ జమానాలో పిచ్చి బ్రాండ్లకు అడ్డుకట్ట వేసింది. దాదాపు 200 రకాల నాణ్యమైన బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చింది. జగన్ జమానాలో రాష్ట్రాన్ని వదిలి పారిపోయిన కంపెనీలు మళ్లీ తిరిగొచ్చాయి.అయితే.. ఆ మేరకు ఆదాయం సమకూరకపోవడంతో పాటు మద్యం తాగే విషయంలో మందుబాబులు ఇబ్బందులు పడుతుండడం.. బహిరంగ మద్యం పానంపై విమర్శలు రావడం వంటి అంశాలపై ప్రభుత్వం నివేదికలు రప్పించుకొని విశ్లేషణ చేసింది.పర్మిట్ రూమ్‌లు లేకపోవడమే ఇబ్బం దేనిని స్పష్టమైంది.దీంతో పర్మిట్ రూమ్‌లకు అనుమతిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది.

అనుమతి ఇలా ఇస్తారు..

మద్యం షాపుల పక్కన మద్యం తాగడానికి రూమ్‌లను అనుమతిస్తూ ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం. 273ను జారీ చేసింది. దరఖాస్తు చేసుకున్న మద్యం షాపులకు(ఏ4) పర్మిట్ రూమ్‌ను మంజూరు చేస్తారు. ఏడాదికి రూ.55 లక్షల్లోపు మద్యం షాపునకు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ చెల్లించే వాళ్లకు రూ.5 లక్షలు, ఆపై రూ.85 లక్షల వరకూ రూ.7.50 లక్షల వార్షిక లైసెన్సు రుసుం కింద నిర్ణయించారు. 2019కి ముందు టీడీపీ హయాంలో ఉన్న ఫీజునే ఇప్పుడూ పెట్టారు. ఈ రుసుం చెల్లించిన వారికి అనుమతి మంజూరు చేస్తారు. పర్మిట్ రూంలో వంట చేయడానికి వీల్లేదు.షాపు సమయం ప్రకారమే పర్మిట్ రూం తెరిచి ఉంచాలి. భద్రత, పరిశుభ్రత చర్యలూ తీసుకోవాలి. ఎక్సైజ్ కమిషనరేట్ నుంచి పూర్తి ఆదేశాలు రావాలని ఎక్సైజ్ అధికారులు చెప్పారు.

తాగడానికి తిప్పలు తప్పాయ్..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాణ్యమైన బ్రాండ్లు అందుబాటులోకి వచ్చినా.. ధరలు తగ్గినా.. చుక్కేసుకోడానికి చోటుకు మందు బాబులు తిప్పలు పడేవాళ్లు. కిళ్లీ బడ్డీల దగ్గర, చాటుమాటు ప్రదేశాల్లో తాగడం జరిగేది. పోలీసులు, ఎక్సైజ్ వాళ్ల కంటబడితే జరిమానా, కేసు లేదా 'ఎంతో కొంత' వదిలేది. ప్రైవేటు మద్యం షాపులు వచ్చినా తాగడానికి పెద్ద తతంగమే ఉండేది. ఇప్పుడు పర్మిట్‌రూమ్‌లు ఇవ్వడంతో ఆ ఇబ్బందులు తప్పనున్నాయి. బార్‌లలో అదనపు ధరలు వసూలు చేస్తుండడం, పరిశుభ్రత పట్టించుకోకపోవడం వంటి కారణాలతో మద్యం షాపుల్లోనే చుక్కేసుకోవడానికి మందుబాబులు మొగ్గు చూపుతున్నారు. అయితే పర్మిట్ రూమ్‌లు లేక ఇబ్బందిగా ఉండేది. వైసీపీ ప్రభుత్వంలో బార్‌లకు లైసెన్సు ఫీజును రెండేళ్లకు జమ చేసుకొంది. వాళ్లకు ఈ ఏడాది ఆగస్టు వరకూ సమయం ఉంది. దీంతో కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చినా రాబడిలో కూడా పెద్దగా ఫలితం కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చినా కొత్త బార్ పాలసీలో మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకున్నారు. అంటే ఆ మండలానికి కేటాయించిన షాపులు మండల పరిధిలో ఎక్కడైనా పెట్టుకోవచ్చు.మండల కేంద్రాల్లో జన సంచారం ఎక్కువగా ఉంటుందని అక్కడే షాపులు పెట్టారు.కాస్త పెద్ద గ్రామాల్లో సైతం మద్యం దుకాణం అందుబాటులోకి రాలేదు.ఇది కూడా రాబడిపై ప్రతికూల ప్రభావం చూపింది. ఇప్పుడు పర్మిట్ రూంలు ఇవ్వడంతో ఆ సమ స్యలు తీరనున్నాయి.పెద్ద గ్రామాల్లో మినీ మద్యం షా పులు ఏర్పాటు చేయాలని మందుబాబులు కోరుతున్నారు.

- ఉమ్మడి జిల్లాలో 455 దుకాణాలు
- రూ.5 లక్షలు, రూ.7.50 లక్షల ఫీజు
- రూ.30 కోట్ల వరకూ ఆదాయం
- ప్రభుత్వ జీవో విడుదల
- మందుబాబుల ఆనందం

మొత్తం 455 షాపులు

తూర్పు గోదావరిలో 138, కాకినాడ జిల్లాలో 171, కోనసీమ జిల్లాలో 146 ప్రైవేటు మద్యం దుకాణాలు ఉన్నాయి. మొత్తంగా 452 మద్యం షాపులు 43 బార్లు ఉన్నాయి.ప్రభుత్వం బార్లకు మినహా అన్ని షాపులకూ పర్మిట్ రూంల అనుమతిస్తుంది. పర్మిట్ రూంల ద్వారా ఏడాదికి ప్రభుత్వ ఖజానాకు రూ.30 కోట్ల వరకూ జమ కానుంది. అలాగే మద్యం రాబడి పెరిగే అవకాశం ఉంది.

రూ.20 లక్షలు

ఏమయ్యాయి!

- వెంకటనగరం పంచాయతీలో అవినీతి ఆరోపణ
- గత కార్యదర్శి రాజానగరం బదిలీ
- నెలన్నర దాటినా కొత్త కార్యదర్శికి నో చార్జి
- పట్టించుకోని ఉన్నతాధికారులు

రాజమహేంద్రవరం రూరల్ జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రూరల్ మండలం లోనే అది ఒక మైనర్ పంచాయతీ..ఆదాయం చూస్తే సుమారు అర కోటి.. పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల ప్రకారం అధికారులు చేపడుతున్న రీ-ఎసెస్‌మెంట్ల విషయంతో అధికారులు చిత్తశుద్ధితో పన్నులు మదింపు చేస్తే మరో రూ.20 నుంచి రూ.25 లక్షల అదనంగా చేకూరుతుందని పలువురు చెబుతున్న మాట. అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పంచాయతీ నిధులు పక్కదారి పడుతున్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం వెంకటనగరం పంచాయతీలో సుమారు 945 ఎసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 905 ఎసెస్‌మెంట్లకు పన్నులు వేసినట్టు సమాచారం.ఇక్కడ గ్రామ కార్యదర్శిగా పని చేసిన రాణి బదిలీపై రాజానగరం మండలం వెళ్లారు. సుమారు నెలన్నర కావొస్తున్నా నేటికి కొత్తగా విధుల్లో చేరిన కార్య దర్శికి పూర్తిస్థాయిలో చార్జి కూడా అప్పగించలేదు.పంచాయతీకి రావాల్సిన పన్నులు, బిల్డింగ్ పన్నులు పంచాయతీ ఖాతాకు జమచేయకుండా సుమారు రూ.20 లక్షలు గత కార్యదర్శి దుర్వినియోగం చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రస్తుత కార్యదర్శికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించ లేదని సమాచారం.ఈ మేరకు సమాచారం అందినా ఉన్నతాధికారులు మిన్న కుండిపోయారు.నేటి వరకూ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. బదిలీపై వెళ్లిన వారు కొత్తగా విధుల్లోకి చేరిన వారికి పంచాయతీకి సంబంధించిన చార్జి అప్పగించాల్సిందేనని డీపీవో శాంతామణి, డీఎల్‌పీవో నాగలత చెబుతున్నారే తప్ప, దీనిపై ఎలాంటి స్పందనా లేదు.దీనిపై అనుమానాలు వెల్లు వెత్తుతున్నాయి.చిన్న గ్రామమైన వెంకటనగరంపై కలెక్టర్ దృష్టి సారిస్తే జనాభా ప్రాతిపదికన కాకుండా ఆదాయం ప్రాతిపదికన గ్రేడ్-1 పంచాయతీల లిస్టులో చేరుతుందని ఆ పంచాయతీ మాజీ ఉద్యోగులే చెబుతున్నారు.

రైతులకు సహకారమేది!

- గత వైసీపీలో సొసైటీలు దోపిడీ
- నాటి నుంచి మారిన తీరు
- గత 12 ఏళ్లగా ఎన్నికల్లేవ్
- 101 సొసైటీలకు త్రీమెన్ కమిటీలు
- ప్రమాణస్వీకారాలతో జోష్
- పెండింగ్‌లో ఆరు సొసైటీలు
- ఎన్నికలకు రైతుల డిమాండ్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్)కు సొసైటీలకు కొత్త పాలకవర్గాలు వచ్చాయి.2013లో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్)కు ఎన్నికలు జరిగాయి. తర్వాత వాటికి ఎన్నికలు నిర్వహించలేదు. ఒక్కో సంఘంలో 12 మంది సభ్యులు ఉండేవారు. జిల్లాలో రూ.15 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకూ టర్నోవర్ ఉన్న సొసైటీలు ఉన్నాయి.గతంలో సొసైటీలు రైతుల సౌకర్యార్థం పని చేసేవి. ప్రస్తుతం చాలా సొసైటీల్లో అక్రమాలు పెరిగాయి.వీటిని సక్రమంగా నడిపిస్తే ఆయా సొసైటీల పరిధిలోని రైతులు అప్పులకు ఎరువులు వ్యాపారులు, మిల్లర్ల వద్దకు పరుగులు పెట్టాల్సిన అవసరం లేదు. సొసైటీలకు 2013లో ఎన్నికలు జరిగాయి. తర్వాత ఇప్పటి వరకూ జరగలేదు. దీంతో ఆయా సొసైటీల్లో పనిచేసే అధికారులు,ఉద్యోగులు ముదిరిపోయారు. రాజకీయనేతలను ప్రభుత్వాలే నేరుగా పాలకవర్గాలుగా నియమించడం వల్ల కూడా కొందరు బరి తెగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టి సొసైటీలకు పూర్వ వైభవం తీసుకురావాల్సి ఉంది.త్వరలో ప్రభుత్వం సొసైటీ ఎన్నికల దిశగా ఆలోచించాలని రైతులు, సొసైటీ సభ్యులు కోరుతున్నారు.

అవినీతికి సహకారం

ప్రస్తుతం జిల్లాలో పలు సొసైటీల్లో జరిగిన అక్రమాలపై 51 ఎంక్వయిరీ జరుగుతోంది. వెదుళ్లపల్లి లో ఇప్పటికే రూ.1 కోటి 10 లక్షల వరకూ అవినీతి జరిగినట్టు సహకార అధికారులు ధ్రువీకరించారు. ఇది రూ.2 కోట్ల వరకూ చేరవచ్చనే అంచనా ఉంది. శ్రీరంగపట్నంలో రూ.5 కోట్ల అక్రమాలను ధ్రువీకరించారు.ఇక్కడ క్రిమినల్ కేసు నడుస్తోంది. మురమండ సొసైటీలో కూడా 51 ఎంక్వయిరీ జరుగుతోంది. సుమారు రూ.50 లక్షల వరకూ అవినీతి జరిగి ఉండొచ్చనే ప్రచారం ఉంది. ఇలా జిల్లావ్యాప్తంగా చాలా సొసైటీల్లో అక్రమాలు జరుగుతున్నాయి.

101 సొసైటీలకు త్రీమెన్ కమిటీలు

జిల్లాలో 107 సొసైటీలు ఉన్నాయి. ఇప్పటి వరకూ 101 సొసైటీలకు త్రీమెన్ కమిటీలను నియమించారు. అధికంగా టీడీపీ వర్గాలకు రాగా, కొన్ని జనసేనకు, కొద్దిగా బీజేపీకి దక్కాయి.ఒక్కో కమిటీలో ముగ్గురు ఉండడం వల్ల 107 సొసైటీలకు త్రిమెన్ కమిటీలను నియమిస్తే 321 మందికి నామినేటెడ్ పదవులు దక్కినట్టు అవుతుంది. ఇంకా ఆరు కమిటీలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటికి కూడా పేర్లు ప్రతిపాదించారు. శ్రీరంగపట్నంలో ప్రతిపాదించిన ఒకరి పేరు మరో సొసైటీలో కూడా ఉండడంతో దానిని మార్చి మరో పేరు పంపించారు. నల్లజర్ల, వెదుళ్లపల్లి, మిర్తిపాడు, రాపాక, ఉండేశ్వరపురం,శ్రీరంగపట్నం సొసైటీల త్రీమెన్ కమిటీలు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం నియమించిన త్రీమెన్ కమిటీలన్నీ వచ్చే జనవరి 30వ తేదీ వరకూ అధికారంలో ఉంటాయి. అప్పటి లోపు ఎన్నికలు జరిగితే కొత్త పాలకవర్గాలు వస్తాయి.

దివ్యాంగులతో సదరంగం!

సదరం సర్టిఫికెట్ల పరిశీలనకు వెళ్లారా ఉదయం నుంచి సాయంత్రం వరకూ అష్టకష్టాలే.. దివ్యాంగులు అన్న కనికరం ఉండదు.. అయ్యో పాపం అన్న జాలి ఉండదు.. కనీసం పట్టించుకునేవారు ఉండరు.. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది.. స్లాట్ బుక్ చేసుకుని దివ్యాంగులకు వచ్చిన రోజు ఆసుపత్రికి చేరుకుంటున్నారు. అయితే వచ్చినప్పటి నుంచి వెళ్లే వరకూ ఇంతే. కూడా ఎవరైనా వస్తే సరి లేదంటే ఒక పట్టాన తెవలదు.. బుధవారం కూడా సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరిగింది. ఉదయం నుంచి ఇలా బారులుతీరి కనిపించారు. ఎప్పుడు తమ వంతు వస్తుందా అంటూ చాలా సమయం చూస్తూనే ఉన్నారు.. అయ్యా వైద్యాధికారులు వారు దివ్యాంగులు అనే మాట గుర్తు పెట్టుకోండి సార్.. ఇకనైనా కాస్త వెసులుబాటు కల్పించండి మరి.



సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన దివ్యాంగుల క్యూలు

- ఫొటోగ్రాఫర్ - రాజమహేంద్రవరం

స్వాతంత్ర్య దినోత్సవం ఎక్కడ?

ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాట్లు - వర్షాలతో అయోమయం



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకులకు ముస్తాబవుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం

రాజమహేంద్రవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి):భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు ప్రత్యామ్నాయ వేదికను పరిశీలిస్తున్నామని జేసీ చిన్న రాముడు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాట్లు చేశామని.. సుబ్రహ్మణ్య మైదానం వంటి ప్రదేశాలను పరిశీలిస్తున్నామన్నారు. కలెక్టర్ ప్రశాంతి తుది నిర్ణయం తీసుకుంటారన్నారు.ఈ మేరకు జేసీ చిన్నరాముడు, అడిషనల్ ఎస్పీలు మురళీ కృష్ణ, చెంచురెడ్డి,అర్జున్, ఆర్డీవో కృష్ణ నాయక్,డీఎస్పీ రవికుమార్ తదితర అధికారులతో కూడిన బృందం బుధవారం సుబ్రహ్మణ్య మైదానాన్ని పరిశీలించింది.



తోకాడలో జరిగిన సభకు హాజరైన రైతులు, కలెక్టర్, ఇతర అధికారులు

భూ వివాదాల నిర్మూలనలో రీ-సర్వే కీలకం

తోకాడలో జరిగిన రీ-సర్వే ఫైనల్ ఆర్‌వోఆర్ సభలో కలెక్టర్

రాజానగరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : భూవివాదాల నిర్మూలనలో రీ-సర్వే కీలక భూమిక పోషిస్తుందని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రీ-సర్వే ప్రాజెక్టు ఫేజ్-లో భాగంగా ఇటీవల జారీ చేసిన 13వ నోటిఫికేషన్ ప్రకారం రాజానగరం మండలం తోకాడ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఫైనల్ ఆర్‌వోఆర్ గ్రామ సభకు జిల్లా కలెక్టర్ ప్రశాంతి హాజరై మాట్లాడారు. రీ-సర్వే ప్రక్రియ భూహక్కులు స్పష్టత రావడం, భూవివాదాలు తగ్గడం, రికార్డుల ఖచ్చితత్వానికి దోహద పడుతుందన్నారు.రీ-సర్వే ప్రక్రియపై అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 658 సర్వే నెంబర్లకు 3410 ఎల్‌పీఎం డీఎల్‌ఆర్ పబ్లికేషన్ చేశామన్నారు. గ్రామ విస్తీర్ణం 4674.19 ఎకరాలు ఉండగా రీ-సర్వే అనంతరం 4654.969 ఎకరాలు నిర్ధారించబడిందన్నారు. ప్రభుత్వ భూమి సర్వే నంబర్లు 147(341.65)ఎకరాలు ఉండగా రీ-సర్వే అనంతరం 341.052 ఎకరాలు ఖరారైనట్లుగా చెప్పారు. ప్రైవేట్ భూమి సర్వే నెంబర్ల 415(4332.54) ఎకరాలు ఉండగా రీసర్వే అనంతరం 4313.91 ఎకరాలు నమోదైనట్టు చెప్పారు. మొత్తం ఖాతాలు 1938 నుంచి 1924కు తగ్గినట్లుగా వెల్ల డించారు. గ్రామ సభలో రీసర్వే అధికారి మోహన్‌రావు, తహశీల్దార్ జి.అనంత లక్ష్మీ సత్యవతి దేవి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరులో మన యోధులెందరో..

- ఆంధ్రజ్యోతి, రాజమహేంద్రవరం



'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ'- 'ఏ తల్లి నినుగన్నదో ఆ తల్లినే కన్నభూమి గొప్పదిరా' అనే వాక్కులను నరనరాన జీర్ణించుకున్న ఎందరో భరతమాత ముద్దుబిడ్డలు తృణప్రాయంగా అర్పించిన ప్రాణాల ప్రతిఫలమే ఈనాటి మన ఈ స్వేచ్ఛావాయువులు. భారత జాతికి ప్రతీక అయిన మువ్వన్నెల జెండా శాంతంగా, ఠీవిగా, సగర్వంగా ఎగురుతున్న రెపరెపల్లో ఎన్నో కన్నీటి గాథలు, ప్రాణ త్యాగాలు ఇమిడివున్నాయి. తెల్లదొరల పీచమణిచి తరిమికొట్టిన స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో గోదావరి తీరం రాజమహేంద్రవరానికి చెందిన ఎందరో ప్రముఖులు జాతిని మేలుకొలపడంలో ఎనలేని ఎల్లలెరుగని కృషి చేసి 'స్వాతంత్ర్యానికి' ఊపిరి పోశారు. ఉద్యమానికి అటు రొమ్మువిరిచి, ఇటు మౌనంగా పోరాడే ఎందరో యోధులను ఈ గోదావరి తీరం అందించింది. ఆ చరిత్రను ఒక్కసారి తిరగేస్తే ఆనాటి అలుపెరగని పోరాటం మన కళ్ల ముందు కదలాడుతుంది మౌనంగా..





కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని ఫ్రీడం పార్కులో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు

గాంధీ, నేతాజీ ప్రసంగాలకు వేదిక రాజమండ్రి పాల్‌చౌక్

గోదావరి తీరాన ఎగిసిపడిన స్వాతంత్ర్య అలలు

స్వాతంత్ర్య సమరంలో రాజమహేంద్రవరం గోదావరి జిల్లాల్లో కేంద్ర బిందువుగా ఉండేది. గాంధీజీ పర్యటనకు ఈ ప్రాంతంలో ఇక్కడ నుంచే మొదలయ్యేవి. దాంతో ఎందరో ఉద్యమకారులకు ఇది కేంద్రంగా మారింది. ఇందులో కొన్ని ప్రధాన ఘట్టాలను పరిశీలిస్తే.. 1893లో రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్టణానికి రైలుమార్గం వేశారు. 1900లో హేవలాక్ బ్రిడ్జి(పాత బ్రిడ్జి) నిర్మాణం తర్వాత విజయవాడకు రైళ్లు నడిచేవి. గాంధీజీ రైలులో రాజమహేంద్రవరం వచ్చి గోదావరి స్టేషనులో దిగేవారు.

● స్వదేశీ ఉద్యమ ప్రచారానికి రాజమహేంద్రవరమే ప్రముఖ కేంద్రం. 1905 జూలైలో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా వందేమాతర ఉద్యమం మొదలైంది. అదే ఏడాది ఏప్రిల్‌లో బిపిన్ చంద్రపాల్ రాజమహేంద్రవరం వచ్చారు. అంతకుముందే స్వదేశీ ఉద్యమాన్ని ప్రోత్సహించే క్రమంలో నగరంలో కొందరు యువకులు బాల భారతి సమితిని ప్రారంభించారు. పాల్ ఇక్కడికి వచ్చినపుడు ఆయన వెంట ముట్నూరి కృష్ణారావు కూడా వచ్చారు. వాళ్లిద్దరూ మాదెండ్ల శౌరయ్య ఇంట్లో బస చేశారు. 1907 ఏప్రిల్ 19, 20, 21లో నగరంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇప్పుడు మనం కోటిపల్లి బస్టాండ్‌గా పిలుస్తున్న ప్రాంతంలోనే పాల్ ఉత్తేజపరిచేలా ఉపన్యసించారు. అప్పట్లో ఈ ప్రాంతం విశాల మైదానంగా ఉండేది. ఇప్పుడు జెట్టీ టవర్సు ఉన్న ప్రాంతం లారీల స్టాండు. పాల్ ఉపన్యాసాలతో ప్రజల్లో దేశభక్తి ఉగ్రరూతలూగింది. క్రమేణా ఆ ప్రాంతానికి పాల్‌చౌక్‌గా పేరొచ్చింది. గాంధీజీ కూడా ఇక్కడి నుంచే జాతిని మేల్కొలిపే ప్రసంగాలు చేశారు. జాతీయోద్యమంలో భాగంగా రాజమహేంద్రవరంలో జాతీయ పాఠశాల నెలకొల్పడం కోసం రాజమండ్రి కరణం సత్యవోలు గున్నేశ్వర రావు పాల్‌కి అప్పట్లో రూ.వెయ్యి విరాళమిచ్చారు. పాల్ ఉపన్యాసాలను చిలకమర్తి లక్ష్మీనరసింహ రావు తెలుగులోకి అనువదించేవారు. ఆ సందర్భంలోనే ఆయన.. "భరత ఖండంబు చక్కటి పాడియావు, హిందువులు లేగదూడలై యేడ్చుచుండ, తెల్లవారను గడసరి గొల్లవారు, పితుకుచున్నారు మూతులు బిగియగట్టి" అనే పద్యాన్ని ఆశువుగా చెప్పారు.

● 1939 సెప్టెంబరు 3న రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. అదే రోజున సుభాశ్ చంద్ర బోస్ నగరానికి వచ్చారు. ఆ ఏడాది మార్చిలో త్రిపురలో జరిగిన సభలో ఆయన కాంగ్రెసు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అయితే, కాంగ్రెసులోని మితవాదవర్గం ప్రతిష్టంభన సృష్టించింది. దాంతో బోసు తన పదవికి రాజీనామా ఇచ్చారు. క్రమశిక్షణ ఉల్లంఘించాడంటూ ఆయనను మూడేళ్ల పాటు బాధ్యతాయుత స్థానాల నుంచి కాంగ్రెసు బహిష్కరించింది. అప్పుడు ఫార్వర్డు బ్లాకును ఏర్పాటుచేసిన బోసు.. ఆంధ్రదేశ పర్యటనకు ఉపక్రమించారు. దానిలో భాగంగా నగరానికి వచ్చారు. పాల్‌చౌక్‌లో గొప్ప బహిరంగ సభ జరిగింది. ఆయన ఉపన్యాసాన్ని మద్దూరు అన్నపూర్ణయ్య తెలుగులో అనువదించారు.

● గాంధీజీ, నేతాజీ వంటి దిగ్గజ నాయకులు రాజమహేంద్రవరం వస్తే దేవత శ్రీరామమూర్తి ఇంట్లో బస చేసేవారు. జాతీయ జెండాను తన ఇంటిపై ఎగురవేసుకునే హక్కు హైకోర్టులో పోరాడి గెలిచారు శ్రీరామమూర్తి.

● రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల ఘటన స్వాతంత్ర్యోద్యమంలో ఆంధ్రదేశ యువత చురుగ్గా పాల్గొనడానికి నాంది పలికింది. బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలతో కళాశాల విద్యార్థులు ఉత్తేజితులయ్యారు. వందేమాతరం అని రాసిన ప్లకార్డులను పట్టుకొని తిరిగేవారు. వందేమాతరం పతాకాన్ని, చిహ్నాలను ధరించరాదని అప్పటి ప్రిన్సిపాల్ హంటర్ నిషేధాజ్ఞలు జారీచేశాడు. కానీ వందేమాతరం పతకాలను, చిహ్నాలను ధరించి పరీక్షలకు హాజరయ్యారు. తీసేయాలని హంటర్ చెప్పినా తీయకపోవడంతో కొందరిని సస్పెండ్ చేశాడు.

● 1920లో గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభించారు. రాజమండ్రిలో మహిళలు ఆ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. వీరిలో దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మ ముఖ్యులు.

● శిక్షణ పొందిన స్వయంసేవకులు రాజమహేంద్రవరం నుంచే సత్యాగ్రహ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. కాకినాడ, వాడపల్లి, చెన్నైల్లో సత్యాగ్రహ శిబిరాలకు తరలివెళ్లారు. దుర్గాబాయి, దువ్వూరి సుబ్బమ్మ, పెద్దాడ కామేశ్వరమ్మ మహిళలకు, కొవ్వాడి లింగరాజు పురుషుల బృందానికి నాయకత్వం వహించారు.

● 1942 ఆగస్టు 5న ముంబైలో జరిగిన కాంగ్రెసు మహాసభ క్విట్ ఇండియా తీర్మానాన్ని చేసింది. గాంధీ 'డు ఆర్ డై' అనే నినాదాన్ని ప్రకటించారు. ఈనేపథ్యంలో రాజమహేంద్రవరం గోదావరి రైల్వే స్టేషనులో డాక్టరు నాగేశ్వరరావు, కొవ్విడి లింగరాజును అరెస్టు చేసి జైలుకు తరలించారు. మునిసిపల్ పార్కులో సూరంపూడి శ్రీహరిరావు సభ నిర్వహించారు. మూడో పట్టణ పోలీసులు దాడి చేయగా వాళ్లపై ప్రజలు రాళ్ల వర్షం కురిపించారు. గోదావరి స్టేషను, మూడో పట్టణ పోలీస్ స్టేషన్లపై దాడికి వెళ్లారు. డీలక్సు సెంటరులో పోలీసులతో ఒకరకంగా యుద్ధమే జరిగింది. సాయంత్రం శద్ధానంద(లాంచీల రేవు) ఘాట్‌లో బహిరంగ సభ జరిగింది.

● స్వాతంత్ర్యోద్యమానికి దన్నుగా రాజమహేంద్రిలో ఎగిసిపడిన జ్వాలలకు మౌన సాక్ష్యం నేటి నగరపాలక సంస్థ కార్యాలయ సమీపంలోని సుబ్రహ్మణ్య మైదానం. డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం సీతానగరంలో గౌతమీ సత్యాగ్రహాశ్రమాన్ని స్థాపించి.. అదే కేంద్రంగా శాసనోల్లంఘన ఉద్యమాన్ని చురుగ్గా నడిపేవారు. ఓ రోజున రాజమహేంద్రవరంలోని నాళం భీమరాజు ఇంట్లో బస చేశారు. ఈ విషయం తెలుసుకున్న రాజమండ్రి డీఎస్పీ ముస్తాఫా ఆలీఖాన్ నిప్పులు కక్కుతూ భీమరాజు ఇంటికి వెళ్లాడు. బయటకు పిలిచాడు. ఆయన బయటకు రాగానే లాఠీతో విరుచుకుపడి 'నీ గాంధీని ఇప్పుడు రమ్మనరా' అంటూ హేళన చేస్తూ చితకబాదాడు. మెయిన్ రోడ్డులో కొట్టుకుంటూ ఈడ్చుకెళ్లాడు. ఆ దెబ్బలతో సుబ్రహ్మణ్యం తీవ్రంగా గాయపడ్డారు. ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయి. పక్కటెముకలు విరిగిపోయాయి. క్షయ వ్యాధి పీడించింది. స్వాతంత్ర్యోద్యమం కోసం వైద్య వృత్తిని సైతం పక్కన పెట్టిన బ్రహ్మజోస్యుల అనారోగ్యంతో 1936లో అందరినీ విడిచి వెళ్లిపోయారు.





పాల్‌చౌక్..

● పాల్‌చౌక్ దగ్గర స్వాతంత్ర్య సమరయోధుల పార్కు ఏర్పాటు అయ్యింది. ఇక్కడ మహిళా సమరయోధుల విగ్రహాలను నెలకొల్పారు. గోదావరి గడ్డపై నుంచి వీరోచితంగా బ్రిటిష్ వారితో పోరాడి ఎంతో హింసను ఎదుర్కొని జైలు జీవితం గడిపిన 13 మందిలో 12 మంది చరిత్ర అతి కష్టంపై జైలు రికార్డుల ద్వారా లభ్యమైంది. దీంతో వైఎస్ నరసింహారావు వారి విగ్రహాలను నెలకొల్పారు. భారతదేశం మొత్తం మీద ఇంతమంది మహిళా సమరయోధులు జైలు జీవితం అనుభవించిన దాఖలాలు ఎక్కడా లేవని చెబుతారు. ఈ పార్కు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఉండగా.. ఆంధ్ర కేసరి యువజన సమితి నిర్వహణ చూస్తోంది.

నాడు పోలీస్ పరేడ్ గ్రౌండ్.. నేడు సుబ్రహ్మణ్య మైదానం

సుబ్రహ్మణ్య మైదానం బ్రిటీష్ పాలనలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌గా ఉండేది. స్వాతంత్ర్య పోరాటానికి ప్రాణాలు అర్పించిన బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యాన్ని జాతి మరువరాదనే ఉద్దేశంతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజున అంటే 1947 ఆగస్టు 15న ఆ ప్రదేశానికి 'సుబ్రహ్మణ్య మైదానం'గా కల్నల్ డీఎస్ రాజు నామకరణం చేశారు. నగరపాలక సంస్థ కూడా నోటిఫై చేసింది. నేతాజీ అంతరంగిక వైద్యులైన రాజు.. లోక్‌సభలో రెండు పర్యాయాలు రాజమహేంద్రవరానికి ప్రాతినిధ్యం వహించారు. కేంద్రమంత్రిగా కూడా సేవలందించారు. జలగం వెంగళరావు హయాంలో ఇక్కడ పోలీస్ క్వార్టర్లు కట్టడానికి ప్రతిపాదనలు రూపొందించారు. అయితే స్వాతంత్ర్య సమరవీరుడు బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యం మరణానికి కారణమైన పోలీసులకు క్వార్టర్లను అక్కడ నిర్మిస్తే చరిత్ర క్షమించదంటూ వావిలాల గోపాలకృష్ణయ్య తదితరులు అడ్డుకొన్నారు. దీంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. కానీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో షోకులకు పోయి చారిత్రక ఆనవాలును కాలగర్భంలో కలిపేశారు.

పిఠాపురంలో నేటి నుంచి రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

▸ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్లకు ఎంపికైన బాలబాలికలకు ఆర్ఆర్‌బీహెచ్ఆర్ క్రీడా మైదానంలో శిక్షణ

పిఠాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్, ఉమ్మడి తూర్పు గోదావరి, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పిఠాపురంలో 10వ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ గురువారం ప్రారంభం కానుంది. పాత బస్టాండు వద్ద గల మునిసిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 17వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి బాలబాలికల జట్లు రానున్నాయి. ఇప్పటికే కొన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పిఠాపురం చేరుకోగా వారికి వసతి సౌకర్యం కల్పించారు. గురువారం సాయంత్రం నుంచి ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్, బొజ్జా మాణిక్యాలరావు, కోశాధికారి కొత్తెం సుందరకుమార్ తెలిపారు.

క్రీడాకారులకు శిక్షణ

రాష్ట్ర స్థాయి 10వ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్లను ఎంపిక చేశారు. క్రీడాకారులకు పిఠాపురంలోని పాత బస్టాండు వద్ద గల బాస్కెట్‌బాల్ క్రీడా మైదానంలో ఉదయం, సాయంత్రం నుంచి రాత్రి వరకు విజయమే లక్ష్యంగా శిక్షణ ఇస్తున్నారు. బాల, బాలికల జట్లకు ఎంపికైన క్రీడాకారుల మధ్య పోటీలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను సన్నద్ధం చేస్తున్నామని శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షకుడు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు (అయలు) తెలిపారు.



ఫ్లడ్ లైట్ల వెలుగులో శిక్షణ పొందుతున్న బాలురు

బాలికల జట్టు:

ఎం.మానస, బి.శాలిని, పీసీ హాసిని, పి.హరిణి (జిల్లా క్రీడా మైదానం, కాకినాడ), పి.డోలాశంకరి, సీహెచ్ ఐశ్వర్య, ఎస్.రమ్య, డి.పూజిత (రామచంద్రపురం), ఎం.మౌనిక, ఎస్.చరిష్మా (అంబాజీపేట), డి.హాసిని (గొల్లలమామిడాడ), సీహెచ్ మౌనిక, ఎం.జాహ్నవి (ఏపీఎస్పీ, కాకినాడ), డి.హాసిని, ఎ.శిరీషాదేవి, ఎం.రమ్య, ఎ.కామాక్షి (అమలాపురం), ఎల్.సాగ్వి (రాజమహేంద్రవరం), సీహెచ్ మానస, ఎస్.కావ్యశ్రీ (పిఠాపురం)

బాలుర జట్టు:

కె.జోషిత్ నారాయణ, వి.తేజస్వరూప్, కె.హర్షిత్, హర్షతేజ, ఎ.శ్యామ్, పాలల ప్రసాద్ (రామచంద్రపరం), ఎ.జగన్, వి.హేమంత్‌కుమార్ (అమలాపురం), కె.ఠాగూర్, పి.పీయూష్, పి.దత్తు, ఎస్.నందకిషోర్ (పిఠాపురం), కృష్ణారెడ్డి, గౌతమ్ (గొల్లలమామిడాడ), సీహెచ్ ఫణీంద్ర, ఎం.సూర్య (ఏపీఎస్పీ), ఆర్.గర్విన్ (జిల్లా క్రీడా మైదానం, కాకినాడ), ఎ.భువన్‌సాయి వంశీ, ప్రవీణ్ (రాజమహేంద్రవరం), ఎన్.చాణిక్య (సామర్లకోట), పి.ప్రశాంతకుమార్ (అనపర్తి)

'నన్నయ' విద్యార్థులు విశ్వ పౌరులుగా ఎదగాలి



సభికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్. చిత్రంలో 'నన్నయ' వీసీ ప్రసన్నశ్రీ

తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్

దివాన్‌చెరువు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు విశ్వ పౌరులుగా ఎదగాలని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ ఆకాంక్షించారు. నన్నయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ర్యాగింగ్ నిరోధక వారోత్సవాల్లో భాగంగా బుధవారం జరిగిన కార్యక్రమానికి ఎస్పీ నరసింహకిశోర్, ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నన్నయ పేరుతో స్థాపితమైన ఈ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులంతా చాలా అదృష్టవంతులని, విశ్వజనీనమైన ఆలోచనలతో ఉండాలన్నారు. యూనివర్సిటీల్లో చదివేవారు విద్య, విజ్ఞానంలో ఉన్నతంగా ఉంటారని, ర్యాగింగ్ వంటి ఆకతాయితనానికి పోయి జీవితాలను అంధకారమయం చేసుకోవద్దన్నారు. శారీరకంగా, మానసికంగా ఇతరులను బాధపెడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన దుస్థితి దాపురిస్తుందని చెప్పారు. దుశ్చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. చదువుకునే వయసులో అపారమైన జ్ఞానాన్ని సంపాదించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. దానిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. డ్రగ్స్ తీసుకుని అనేక మంది తమ జీవితాలను పాడుచేసుకుంటున్నారని, అటువంటి వాటి జోలికిపోవద్దని సూచించారు.

ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ర్యాగింగ్ ఒక సంప్రదాయం కాదని, మానసిక రుగ్మతగా విద్యార్థులు గుర్తించాలన్నారు. ప్రతి విద్యార్థీ కలలు కనేందుకు సురక్షితంగా భావించే సంస్కృతి నిర్మిద్దామన్నారు. సీనియర్లు హింసించే వారిగా కాకుండా మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. వ్యక్తిత్వంతో విజయాన్ని కొలవగల ప్రదేశంగా నన్నయ విశ్వవిద్యాలయాన్ని మారుద్దామన్నారు.

అనంతరం మాదకద్రవ్య రహిత సమాజానికి కృషి చేస్తానని, ర్యాగింగ్‌కు పాల్పడనని సమావేశంలో పాల్గొన్న వారితో ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎస్పీని సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, డీన్ డాక్టర్ ఎన్.ఉదయభాస్కర్, లీగల్ అధికారి నాగేంద్రరావు, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు

వెండితెరపై నవ్వుల రేడు రేలంగి

▸ పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ▸ పుష్కర ఘాట్ వద్ద రేలంగి విగ్రహానికి నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ హాస్యానికి రేలంగి వెంకట్రామయ్య మకుటం లేని మహారాజు పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. హాస్య నట చక్రవర్తి, 'పద్మశ్రీ' అవార్డు గ్రహీత రేలంగి 115వ జయంతిని పురస్కరించుకుని బుధవారం రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద గల ఆయన విగ్రహానికి మంత్రి పుష్పమాల వేసి ఘన నివాళులర్పించారు. తెలుగు తెరపై చెరగని నవ్వుల సంతకం, వెండితెరపై నవ్వుల రేడు రేలంగి అని ఆయన ప్రస్థానాన్ని మననం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు చిత్రసీమ నవ్వుల వనంలో వాడని పువ్వు హాస్య రేలంగి అని కొనియాడారు. తన ఆకారంతోను, ఆహార్యంతోను తెలుగు ప్రేక్షకులను హాస్యపు ఊయలలూగించిన హాస్య బ్రహ్మ అన్నారు. ఒకే షాట్‌లో, ముఖంలో పలు భావాలను మార్చి ప్రదర్శించడం, అందుకు అనుగుణంగా డైలాగ్‌లను టైమింగ్‌లో పలికి హాస్యం పండించడంలో ఆయనకు ఆయనే సాటిగా పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. కీలుగుర్రం, గుణసుందరి కథ, పాతాళభైరవి,పెద్ద మనుషులు, మాయాబజార్, మిస్సమ్మ లాంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించడంతో పాటు వందలాది చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి వెండి తెరను ఏలిన హాస్యపు రాజు రేలంగి అని కీర్తించారు. నాలుగు దశాబ్దాల తన సినీ ప్రయాణంలో ఎన్నో విభిన్నమైన కథలు, విలక్షణమైన పాత్రలు, విరామమెరుగని విజయాలు, రేలంగి ఖాతాలో కనిపిస్తాయన్నారు. రేయింబవళ్లు చెప్పుకున్నా, తరగని అజరామర చరిత్ర రేలంగిదన్నారు. తెలుగు సినిమా హాస్య కుటుంబ వంశవృక్షాన్ని వివరిస్తే మొట్టమొదటి స్థానం ఆయనదేనన్నారు. తనదైన నటనా వైదుష్యంతో ప్రేక్షకులను నవ్వించిన రేలంగి చిరస్మరణీయుడు అన్నారు.

గౌడ, శెట్టిబలిజ సంఘ నగర గౌరవాధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్, అధ్యక్షుడు రెడ్డి రాజు అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగర ప్రముఖులు మార్గాని నాగేశ్వరరావు, గూడూరి రాధిక, మార్గాని సత్యనారాయణ, రెడ్డి మణి, వేమన నారాయణ, బుడ్డిగ రవి, అనుసూరి పద్మలత, కడియాల వీరబాబు, కుడుపూడి సారధి, వంక మల్లిబాబు, వీరమల్ల గోపీకృష్ణ, రాయుడు శ్రీనివాస్, కడియాల వీరభద్రరావు, గెద్దాడ శేఖర్, వియ్యపు రాఘవేంద్రయాదవ్, నరవ గోపాలకృష్ణ, వెలిగట్ల రామ్‌కిషోర్, శీలం గోవిద్, వనుము శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రేలంగి వెంకట్రామయ్య విగ్రహానికి నమస్కరించి నివాళులర్పిస్తున్న మంత్రి దుర్గేష్

ఐసీపీ రెండో దశ కౌన్సెలింగ్‌లో 8 మందికి ప్రవేశాలు

జేఎన్టీయూకే, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ, బీటీహెచ్ స్వీడన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కొలాబొరేటివ్ ప్రోగ్రాం రెండో దశ కౌన్సెలింగ్‌ను వర్సిటీలోని సెనెట్ హాల్లో బుధవారం నిర్వహించారు. మొత్తం 10 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కాగా సీఎస్ఈలో ఐదుగురికి, ఏఐఎంఎల్‌లో ముగ్గురికి ప్రవేశాలు కల్పించినట్టు వర్సిటీ పీఆర్వో, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు.

సీతారామసత్రం కూలగొట్టాల్సిందే

అన్నవరంలో సత్రం నిర్మాణ పటిష్టతను పరిశీలించిన జేఎన్‌టీయూకే బృందం



సీతారామసత్రం పటిష్టతపై పరిశీలిస్తున్న జేఎన్‌టీయూకే బృందం

అన్నవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో భక్తులకు వసతి కల్పించే పురాతననిర్మాణం సీతారామసత్రం శిథిలావస్థకు చేరిందని దీనిని కూలగొట్టాల్సిందేనని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ వి.రవీంద్ర, జి.ఏసురత్నం బృందం నిర్ధారణకు వచ్చారు. బుధవారం రత్నగిరికి విచ్చేసిన వారు ఈవో సుబ్బారావు, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ముందుగా ఆఫీస్ గదిని పరిశీలించి స్లాబ్‌పెచ్చులూడి ఉండడాన్ని చూసి అవాక్కయ్యారు. గునపం, సుత్తి తదితర పరికరాలను ఉపయోగించి భవనం పటిష్టతను పరిశీలించగా ప్రమాదకరంగా ఉందని తేల్చిచెప్పారు. దీనిపై నివేదికను 2రోజుల్లో దేవస్థానానికి అందజేయగా తదుపరి చర్యల నిమిత్తం ఈవో సుబ్బారావు కమిషనర్‌కు నివేదించనున్నారు. ముందుగా ఈ భవనం కూల్చేందుకు టెండర్లు పిలవడం, దీనిస్థానంలో కొత్తనిర్మాణం చేపట్టేందుకు టెండర్లు ఖరారయ్యాయి. దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో 2 నెలలక్రితం దేవదాయ శాఖ సాంకేతిక నిపుణుల బృందం పరిశీలించిన సమయంలో ఈ నిర్మాణం మరో దశాబ్దంపాటు ఇబ్బందిలేదని తెలపడంతో కూల్చివేతను నిలుపుదల చేసి నూతన నిర్మాణం సత్యగిరికొండపై ఆగమ పాఠశాలకు ఎదురుగా నిర్మించాలని నిర్ణయించారు. పనులు ప్రారంభమయ్యే దశలో జేఎన్‌టీయూకే బృందం పరిశీలనతో అధికారులు డైలామాలో పడ్డారు. దీనిని కూల్చివేసినా మాస్టర్‌ప్లాన్ ప్రకారం నిర్మాణాలు సత్యగిరికొండపైకి మార్చాలని ప్రతిపాదనలుండగా ఏ చర్యలు తీసుకుంటారో చూడాలి. కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రామకృష్ణ తదితరులున్నారు.

వామ్మో వాన..



పిఠాపురంలో కురుస్తున్న వర్షం



రాజమహేంద్రవరంలో ప్రజల పాట్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కుండపోతగా కురుస్తూనే ఉంది. దీంతో రోడ్లు చెరువులను తలపించాయి.



ముమ్మిడివరం జీఎంసీ కాలనీలో మురుగుకాల్వను తలపిస్తున్న ఓ వీధి





ముమ్మిడివరం, కరపలో కూలిన చెట్లు



కాకినాడలో రోడ్డుపై వర్షం నీరు

టీటీడీ టికెట్లు ఇప్పిస్తానని మోసం

ఎమ్మెల్యే పీఏ పేరిట ఫోన్లు

పట్టుకున్న పోలీసులు



పోలీసుల అదుపులో నిందితుడు

జగ్గంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానం) టికెట్లు ఇప్పిస్తానని మోసం చేస్తున్న వ్యక్తిని జగ్గంపేట పోలీసులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం గుడిమూలం గ్రామానికి చెందిన 37 ఏళ్ల జి.రాజకుమార్ అలియాస్ ఆర్కే, అలియాస్ విజయ్ కుమార్, అలియాస్ వంశీ గోవాలో ఉంటున్నాడు. అతడిపై పలు చీటింగ్ కేసులు ఉన్నాయి. 2020 నుంచి 2024 వరకు సూర్యాపేట, తణుకు 2, విజయవాడ కృష్ణలంక, పాలకొల్లు, నర్సాపురం, ఎల్‌బీ నగర్ పీఎస్‌ల్లో చీటింగ్ కేసులు ఉన్నాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్, గూగుల్ సెర్చ్ ద్వారా వివరాలు సేకరించేశాడు. ప్రజాప్రతినిధుల వ్యక్తిగత సహాయకుడినని పరిచయం చేసుకుని టీటీడీ బ్రేక్ దర్శనం టికెట్లు ఇప్పిస్తానని నమ్మబలికి డబ్బులు ఆన్‌లైన్ ద్వారా మోసానికి పాల్పడేవాడు. ఇటీవల అతడు తూర్పుగోదావరి జిల్లా గోకవరంలో గోల్డ్‌షాప్ యజమాని పట్నాల నాగేంద్రకి ఫోన్ చేసి తాను జగ్గంపేట ఎమ్మెల్యే పీఏ అని పరిచయం చేసుకుని దర్శనం టికెట్లు ఇప్పిస్తానని అందుకు రూ.50వేలు ఖర్చవుతుందని చెప్పాడు. దీంతో నాగేంద్ర అప్రమత్తమై ఈ సమాచారాన్ని ఎమ్మెల్యేకు తెలపగా ఆయన ఆదేశాలతో పీఏ ప్రసాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బుధవారం వంశీని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా 14రోజుల రిమాండ్ విధించగా పెద్దాపురం సబ్‌జైలుకు తరలించామని జగ్గంపేట పోలీసులు తెలిపారు.

ఖరీదైన ద్విచక్ర వాహనాలే టార్గెట్

● రాజమహేంద్రవరంలో ఇద్దరు దొంగల అరెస్ట్ ● రూ.19 లక్షల విలువైన సొత్తు రికవరీ ● నిందితులపై 18 కేసులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 13 (ఆంధ్ర జ్యోతి): ఖరీదైన ద్విచక్ర వాహనాలే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను ప్రకాశం నగర్ పోలీసులు పట్టుకున్నారు. నిందితులపై వివిధ పోలీస్‌స్టేషన్లలో 18 కేసులు ఉండగా వారి నుంచి రూ.19 లక్షల విలువైన 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్ బాబు బుధవారం వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలో ద్విచక్ర వాహనాల దొంగతనాలపై జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో ప్రత్యేక నిఘా పెట్టారు. బుధవారం సీఐ బా జీలాల్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుం డగా కాకినాడ గాంధీనగర్‌కి చెందిన ఇంటి సురేంద్ర అనుమానాస్పదంగా కనిపించగా ప్రశ్నించారు. 2003 నుంచి దొంగతనాలు చేస్తున్నానని ఒ ప్పుకున్నాడు. అతడిపై అనకాపల్లి, రామచంద్రా పురం, కాకినాడ, పామర్రు, ప్రకాశంనగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయి. రావంచంద్రాపురం పీఎస్‌లో నమోదైన కేసులో చివరిగా 2024లో పట్టుబడి బెయిల్‌పై బయటకు వచ్చాడు. మళ్లీ దొంగతనాలు చేస్తూ స్టిక్కరింగ్ చేసే పిఠాపురానికి చెందిన కామిరెడ్డి యేసుబాబుతో కలిసి ఖరీదైన వాహనాలను చోరీలు చేశారని డీఎస్పీ తెలిపారు. వీళ్లపై ప్రకాశంనగర్ పీఎస్‌లో 7, త్రీటౌన్‌లో 2, బొమ్మూరులో 2, జగ్గంపేటలో 3, కడియం, గోకవరం, పెద్దాపురం, పిఠాపురంలలో ఒక్కటి చొప్పున కేసులు నమోదయ్యాయయన్నారు. నిందితుల నుంచి రూ.19 లక్షల విలు వైన వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో ప్రతిభ చూపిన సీఐ బాజీలాల్, ఎస్ఐ సతీష్, హెచ్‌సీ నాగరాజు, క్రైమ్ పీసీలు శ్రీనివాసరావు, ప్రదీప్‌కుమార్, వీరబాబు, దుర్గాప్రసాద్, శివప్రసాద్‌ను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారని పేర్కొన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలు

కొత్తపేట ఎమ్మెల్యే బండారుకు తృటిలో తప్పిన ప్రమాదం



ఆలమూరులో ఎడ్ల బండిపై ఎమ్మెల్యే, నాయకులు

ఆలమూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులో బుధవారం రైతులు నిర్వహించిన రైతు సంబరాల కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు తృటిలో భారీ ప్రమాదం తప్పింది. చొప్పెల్ల నుంచి ఆలమూరుకు చేరుకున్న ట్రాక్టర్ ర్యాలీ అనంతరం ఎడ్లబళ్లను ఏర్పాటు చేశారు. ఎడ్ల బండిపై ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతోపాటు నాయకులు ఆకుల రామకృష్ణ, ఈదల సత్తిబాబు, చిలువూరి సతీష్‌రాజు పలువురు ఉన్నారు. అక్కడ ఏర్పడిన శబ్దానికి ఒక్కసారిగా ఎడ్ల భయపడి గంతులు చేయడంతో బండి వెనుకకు తిరగబడింది. దీంతో బండిపై ఉన్న నాయకులు ఒక్కసారిగా కిందపడ్డారు. అయితే ఎమ్మెల్యే బండారు బండికి ఉన్న కొయ్యను గట్టిగా పట్టుకోవడంతో కిందపడకుండా ఉండిపోయారు. దీంతో ఆయన ప్రమాదం నుంచి బయటపడ్డారు. సతీష్ రాజు, రామకృష్ణ, సత్తిబాబుతో పాటు పలువురికి గాయాలయ్యాయి.

మంత్రుల పరామర్శ

కొత్తపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆలమూరులో ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావును రాష్ట్ర ఐటీ మానవవనరుల శాఖా మంత్రి నారా లోకేశ్, వ్యవసాయ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఫోన్లో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అలాగే జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు బండారు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

పీఎంవీబీఆర్‌వైతో అదనపు వేతనం, ఆర్థిక ప్రోత్సాహం

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 12 వేల కంపెనీలు నమోదు

ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కమిషనర్ వెంకటేశ్వర్లు

రాజమహేంద్రవరం, ఆగస్టు 13(ఆంధ్ర జ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై) ద్వారా ఉద్యోగికి అదనపు వేతనంతో పాటు యజమానికి ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుందని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ప్రాంతీయ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ మేరకు క్రెడాయ్ ప్రతినిధులతో బుధవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం ఈ నెల 1 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. తొలిసారిగా ఉద్యోగం పొందిన వ్యక్తి ఖాతాలో ఒక నెల ఈపీఎఫ్ వేతనాన్ని (బేసిక్+డీఏ) కేంద్ర ప్రభుత్వం రెండు విడతల్లో జమ చేస్తుందన్నారు. అలా మొత్తం గరిష్ఠంగా రూ.15 వేలను పొందవచ్చన్నారు. కనీసం ఆరు నెలల నిరంతర ఉపాధి ప్రాతిపదికన ఉద్యోగం కల్పించిన యజమానికి నెలకు రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకూ రెండేళ్ల పాటు ఇస్తారని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

తప్పనిసరిగా అమలు

ఉద్యోగికి డీబీటీ విధానంలో, యజమానికి పాన్ అనుసంధాన ఖాతాల ద్వారా ఈ ప్రోత్సాహకాలు జమ అవుతాయన్నారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31 వరకూ కల్పించిన ఉద్యోగాలకు పథకం వర్తిస్తుందన్నారు. రాజమండ్రి ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయ పరిధిలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 12 వేల కంపెనీలు నమోదై ఉన్నాయని, అవన్నీ తప్పనిసరిగా ఈ పథకాన్ని అమలు చేయాల్సి ఉంటుందన్నారు. నిర్మాణ రంగంలో పెద్ద సంఖ్యలో పని చేస్తు న్నారని, వారంతా పథక పరిధిలోకి వచ్చేలా క్రెడాయ్ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగుల పీఎఫ్ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈపీఎఫ్‌వోలో సభ్యత్వం తీసుకుని కనీసం ఒక ఏడాది సర్వీసు పూర్తి చేసిన వారికి ప్రమాద బీమా రూ.2.50 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ లభిస్తుందన్నారు. ఇప్పటికే ప్రైవేటు పాఠశాలల సంఘాలు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్లు, ఆక్వా, చేనేత కార్మిక సంఘాల తో సమావేశాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సహాయ పీఎఫ్ కమిషనర్లు య.శ్రీనివాసరావు, రాధానాథ్ పట్నాయక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు నుంచి దేశవ్యాప్త ఉద్యమం

వర్గీకరణపై తీర్పును సుప్రీంకోర్టు పునఃపరిశీలించాలి

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్

పిఠాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా సెప్టెంబరు నుంచి దేశవ్యాప్త ఉద్యమం ప్రారంభిస్తామని రాక్స్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో బుధవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును 11 మంది జడ్జీలతో కూడిన ధర్మాసనంతో పునర్విచారణ జరిపించాలని కోరారు. ఎస్సీ వర్గీకరణపై పార్లమెంటులో చట్ట సవరణ చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు. సమావేశంలో నాయకులు కొప్పుల ప్రేమ్‌బాబు, నెల్లి సూరిబాబు, కూసి కొండబాబు, ఎమ్ముల సత్తిబాబు, సలాది బాబులు,కాకర వెంకట్రావు పాల్గొన్నారు.



పిఠాపురంలో మాట్లాడుతున్న డాక్టర్ రత్నాకర్

అధికారులపై చర్యలు తీసుకోండి

● పోలవరం పునరావాస ప్యాకేజీ అమలులో నిర్లక్ష్యం

● నిర్వాసితుడి ఆత్మహత్యాయత్న ఘటనపై జాతీయ హక్కుల కమిషన్ ఆగ్రహం

● ఏపీ పునరావాస అధికారుల వైఖరిపై ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి హుకుం

రంపచోడవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పోలవరం పునరావాస ప్యాకేజీ అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న పునరావాస అధికారులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జాతీయ మానవ హక్కుల కమిషన్ హుకుం జారీ చేసింది. గత సంవత్సరం మే నెలలో అల్లూరి జిల్లా దేవీపట్నానికి చెందిన పోలవరం నిర్వాసితుడొకరు తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై ఆంధ్రజ్యోతి తదితర పలు పత్రికల్లో వచ్చిన కథనాలపై అందిన ఫిర్యాదుపై కేసును విచారణకు స్వీకరించిన హక్కుల కమిషన్ మంగళవారం నాటి విచారణ నేపథ్యంలో సీరియస్‌గా స్పందించింది. నిర్వాసితుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అనంతరం మాత్రమే ఆయనకు అందాల్సిన పునరావాస ఫైలును కదలించడం, ఇంత జరిగినా కూడా ఏడాదిగా ఆయనకు ఇవ్వాల్సిన పునరావాసాన్ని ఇవ్వకపోవడం పట్ల కమిషన్ ఆగ్రహాన్ని వ్యక్తం చేసి పునరావాస అధికారుల తీరును ఎండగట్టింది. అంతేకాకుండా ఈ నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులను గుర్తించి చర్యలు చేపట్టాలన్న తాఖీదును కూడా ఏపీ ప్రధాన కార్యదర్శికి జారీ చేస్తూ ఆదేశించింది. వాస్తవానికి గత ప్రభుత్వంలోనే పునరావాస చర్యలను అమలు చేయడంలో నిర్లక్ష్యం జరిగింది. ప్రభుత్వం మారాక కూడా పునరావాస అధికారుల తీరు మారలేదు. దీంతో పోలవరం ప్రాజెక్టును ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పూర్తి చేయాలనుకున్న కూటమి ప్రభుత్వ ప్రయత్నాలకు అధికారుల తీరే అప్రతిష్ఠను తెచ్చిపెడుతోందన్న ఆరోపణలున్నాయి. ఆయా అధికారులంతా ఒకే గూటి పక్షులు మాదిరిగా ఉండటంతో ఉన్నతాధికారులెవ్వరూ చర్యలు తీసుకోవడానికి చొరవ చూపడంలేదు. చివరికి జాతీయ హక్కుల కమిషన్‌తో ఏకంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శే అక్షింతలు వేయించుకోవాల్సిన దుస్థితికి దారితీసింది. ఈ కేసులో ఇకపై పునరావాస అధికారులు వ్యవహరించే నిర్లక్ష్యతీరు ఇలానే కొనసాగితే హక్కుల కమిషనే చర్యలకు ఉపక్రమించి, ప్రభుత్వానికి మచ్చ వచ్చే పరిస్థితులు రాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చించినాడ వారధిపై 18, 21 తేదీల్లో పూర్తిగా ట్రాఫిక్ నిలుపుదల

కోనసీమ కలెక్టర్ ప్రకటన

అమలాపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వశిష్ఠ నదిపై ఉభయ గోదావరి జిల్లాల మధ్య దిండి-చించినాడ మధ్య ఉన్న వారధిపై ఈ నెల 18, 21 తేదీల్లో పూర్తిగా ట్రాఫిక్‌ను నిలుపుదల చేస్తున్నట్టు కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ 2 రోజుల పాటు పూర్తిగా ఈ వారధిపై ఎటువంటి వాహనాల రాకపోకలు ఉండవని స్పష్టం చేశారు. మోటారు సైకిల్‌తో సహా ఏ ఒక్క వాహనం ప్రయాణించడానికి వీలు ఉండదన్నారు. జాతీయ రహదారి 216లో ఉన్న దిండి-చించినాడ మధ్య వారధికి సంబంధించి బేరింగ్ రిప్లేస్‌మెంట్ మరమ్మతుల దృష్ట్యా 2 రోజులు ట్రాఫిక్ నిలుపుదల అనివార్యమైనట్టు కలెక్టర్ తెలిపారు. జాతీయ రహదారి అథారిటీ అధికారుల, రోడ్డు కాంట్రాక్టరు బేరింగుల కొలతలు, స్లీప్ స్థానాల ధ్రువీకరణ కోసం వంతెన స్పాన్‌లను ఎత్తివేయాలని ప్రతిపాదించారని, ఆ దిశగా ఈనెల 18, 21 తేదీల్లో ట్రాఫిక్ నిలుపుదల చేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వాహనాల ట్రాఫిక్ మళ్లింపు విషయంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



దిండి-చించినాడ వారధి

విద్యుత్‌షాక్‌తో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి



ప్రశాంత్ (ఫైల్)

మండపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం జెడ్.మేడపాడు లాకుల వద్ద విద్యుత్ షాక్‌కు గురై ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పసుపులేటి ప్రశాంత్ (34) బుధవారం రాత్రి మరణించాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండపేట మండలం ఇప్పనపాడుకు చెందిన ప్రశాంత్ తల్లి ఇరిగేషన్‌శాఖలో లస్కర్‌గా పనిచేస్తుండగా అదేశాఖలో ప్రశాంత్ ఔట్‌సోర్సింగ్‌లో లస్కర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం లాకులో రీడింగ్ తీసిన అనంతరం ప్రశాంత్ గేదెల షెడ్డులోకి వెళ్లగా కరెంట్ స్తంభానికి విద్యుత్ సరఫరా కావడంతో దాన్ని ముట్టుకున్న ప్రశాంత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటనపై మండపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'లోవ'లో డీఎఫ్‌వో పరిశీలన

తునిరూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో లోవ క్షేత్రంలో తలుపులమ్మ అమ్మవారిని బుధవారం కాకినాడ జిల్లా అటవీ శాఖ అధికారి ప్రభాకర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో, పండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనం చేసి జ్ఞాపిక అందజేశారు. ఆలయంలో అభివృద్ధి పనులను పరిశీలించారు.



అభివృద్ధి పనులను వివరిస్తున్న ఈవో

నారాయణ కళాశాలలో అగ్నిప్రమాదం

సామగ్రి దగ్ధం

రాజమహేంద్రవరం, ఆగస్టు 13(ఆంధ్ర జ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం హుకుంపేటలోని నారాయణ జూనియర్ కళాశాలలో బుధవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. 5 ఫ్లోర్లు కలిగిన భవనంలో కళాశాల నడుస్తోంది. ఐదో ఫ్లోరులో హాస్టల్ ఏర్పాటు చేయడానికి మంచాలు, పరుపులు, ఫర్నీచర్ తదితర సామగ్రిని తీసుకొచ్చి సెల్లార్‌లో పెట్టారు. దీనికి ఒక వైపు దారి ఉండగా.. చుట్టూ ఐరన్ మెస్ ఉంది. గోడ పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అక్కడ ఫీజు పోవడంతో వేస్తున్న సమయంలో నిప్పులు చెలరేగి సెల్లార్‌లోని పరుపుల పై పడ్డాయి. దీంతో మంటలు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మూడు ఫైరింజన్లతో అక్కడికి చేరుకుని సుమారు గంటపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఆ సమయానికి ఇంకా విద్యార్థులు కళాశాలకు రాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆస్తినష్టంపై అంచనా వేయాలని ఫైర్ అధికారులు తెలిపారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

చాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్‌గా శ్రీరామ్‌కృష్ణ


శ్రీరామ్‌కృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి కొరియర్స్ సంక్షేమ సంఘం తరపున రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్‌గా తమ్మన శ్రీరామ్ కృష్ణ నియమితులయ్యారు. సంఘం అధ్యక్షుడు పెదిరెడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమావేశంలో సభ్యులు శ్రీరామ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మానేపల్లి వెంకన్నబాబు, ఆకుల శ్రీనివాస్, కొత్యాల సుబ్బారాయుడు, తలుపూరి ప్రసాదరావు, ఎండీ ఉస్మాన్, జీ. వెంకట జనార్దన్, గ్రంధి వీరపండు, కొరియర్స్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో కూచిపూడి నృత్యప్రదర్శన


కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో జరుగుతున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం శ్రీ రాయ్ కిషోరీ కూచిపూడి నృత్యకళాక్షేత్రం ఆధ్వర్యంలో చిన్నారులతో ఏర్పాటు చేసిన భరత నాట్య ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. శ్రీత్రిదండి స్వామి భక్తి కంకణబన మహారాజ సమక్షంలో జరిగిన ఈ ప్రదర్శనను ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస బ్రహ్మచారి పర్యవేక్షించారు.

'మెడికల్' ప్రొవైడర్ల సంఘం పంచమ వార్షికోత్సవం


డాక్టర్ కుక్రేజను సత్కరిస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బేసిక్ మెడికల్ ప్రొవైడర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ పంచమ వార్షికోత్సవం స్థానిక మెయిన్‌రోడ్డులోని హోటల్ జగదీశ్వరిలో బుధవారం జరిగింది. రాష్ట్ర సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు వీవీ కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నీలూస్ డెంటల్ ఆసుపత్రి అధినేత డాక్టర్ నీలం కుక్రేజ, బీఎంపీ సభ్యులకు దంత సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రతి ఆదివారం ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శిరికి శ్రీనివాస్, ఏవీవైఎస్ శ్రీనివాస్, పీ. బెన్నిబాబు, ఎస్. రామలక్ష్మణరావు, ఆర్. శ్యామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ కుక్రేజను సభ్యులు సత్కరించారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

రాజమహేంద్రవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఖైదీల తరఫున ఉచితంగా వాదించడానికి న్యాయవాదులు అవసరమైనా, బెయిల్ పిటీషన్లు దాఖలు చేయాలన్నా, పై కోర్టుల్లో అప్పీలు చేయాలన్నా లేదా మరే ఇతర న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుందని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఆమె కేంద్ర కారాగారంలోని మహిళా ప్రత్యేక కారాగారాన్ని సందర్శించారు. ఖైదీలకు అందుతున్న వసతి సదుపాయాలపై ఆరా తీశారు. ఖైదీలు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఖైదీలు, నిందితుల కోసం పనిచేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

అల్పపీడనంపై అప్రమత్తత అవసరం : తహశీల్దార్

సీతానగరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఏ. శ్రీనివాస్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విపత్తు నిర్వహణశాఖ సమాచారం మేరకు రానున్న ఐదురోజుల పాటు అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే పిడుగులు, వేగవంతమైన గాలులు, నీటిముంపు, తదితర వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికి ఏ విధమైన సెలవులు మంజూరుకు అనుమతి లేదన్నారు. అలాగే తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైందని, దానికి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జిగా ఉంటారన్నారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 9505132306 కు ఫోన్ చేయవచ్చునని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా మురళీధర్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నేత, పీసీసీ సభ్యుడు బాలేపల్లి మురళీధర్ నియమితులయ్యారు. ఈమేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి పంపించిన నియామక పత్రాన్ని పీసీసీ సభ్యుడు బోడ వెంకట్ చేతులమీదుగా అందుకున్నాడు. ఈ సందర్భంగా బుధవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్ వెల్లడించారు.

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో...

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ అధికారులు



రాజమహేంద్రవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో సీఆర్పీఎఫ్ 42వ బెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ ప్రధాన కార్యాలయం నుంచి పుష్కర్ ఘాట్ వరకు సిపాయిలు జెండాలు చేతపట్టుకొని దేశ భక్తి నినాదాలతో బైక్ ర్యాలీ చేశారు. దేశం, జాతీయ పతాకం గొప్పతనాన్ని ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటిపై జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని సెకండ్ ఇన్ కమాండ్ దీప కోరారు. డిప్యూటీ కమాండెంట్లు దీపక్ కుమార్, దినేశ్‌కుమార్‌శర్మ, డాక్టర్ నితిన్, ఇన్‌స్పెక్టర్ శశి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తిరంగా యాత్ర బైక్ ర్యాలీ

● పాల్గొన్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి, ఎమ్మెల్సీ వీర్రాజు, తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర బైక్ ర్యాలీ నిర్వహించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఈ ర్యాలీలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా కోటిపల్లి బస్టాండు సెంటర్లోని స్వాతంత్ర్య సమరయోధు పార్కులో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుభ్రం చేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీ ప్రారంభించారు. అక్కడి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా దేవీచౌక్, కంబాలచెరువు సెంటర్, సీటీఆర్ఐ, నారాయణపురం వాటర్ ట్యాంకు రోడ్డు, నాగమ్మతల్లి గుడి వీధి మీదుగా రామాలయం సెంటర్‌కు చేరుకుంది. అక్కడ అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మాజీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు, నాయకులు నర్సిపల్లి హారిక, ఎం. కృష్ణ, యానాపు ఏసు, రొంగల గోపి, అడబాల రామకృష్ణ, రజనీ, వీరా వీరాంజనేయులు, రవిశంకర్, కందికొండ రమేష్, కాలెపు సాయిరాం, కురగంటి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఫుడ్ సేఫ్టీ అధికారి తనిఖీలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు రెస్టారెంట్లలో బుధవారం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రుక్కయ్య తనిఖీలు చేశారు. వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చట్ట ప్రకారం చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వంటగదితో పాటు రెస్టారెంట్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఒక వేళ ఎక్కడైనా సమస్యలుంటే తెలపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు జీ.అనంతరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బీ.రాజు, సచివాలయ కార్యదర్శి షహనాజ్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాల లబ్ధికి ఇ క్రాపింగ్ తప్పనిసరి'

సీతానగరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పథకాల లబ్ధికి ఇ క్రాపింగ్ తప్పనిసరి అని వ్యవసాయశాఖ ఏడీ జయరామలక్ష్మి అన్నారు. బుధవారం చినకొండేపూడి సహకార సంఘం వద్ద జరిగిన చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆమె పా ల్గొని మాట్లాడుతూ వెబ్ ల్యాండ్‌కు ఆధార్ లింక్ చేయించుకోవాలన్నారు. ఇవి ఉంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. అలాగే ప్రస్తుతం యూరియా కొరత లేదని, అవసరానికి మాత్రమే రైతులు తీసుకుంటే అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. రైతులు సీజన్ మొత్తానికి సరిపడేవిధంగా ముందు కొనుగోలు చేసుకుని దాచుకుంటే కృత్రిమ కొరత ఏర్పడుతుందన్నారు. భూ యజమానులతో పాటు కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు. రైతులు సరైన సమయంలో ఎరువులు వాడాలన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈ గౌరి దేవి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, సహకార సంఘం అధ్యక్షులు కాండ్రు శేఖర్ , రైతులు, తదితరులు పాల్గొన్నారు

పీఏసీఎస్ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం


చినకొండేపూడిలో ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు

సీతానగరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చినకొండేపూడి పీఏసీఎస్ అధ్యక్షుడిగా కాండ్రు శేఖర్,సీతానగరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా మట్ట వెంకటేశ్వరరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సహకార సంఘాలకు త్రిమెన్ కమిటీల నియామకాల్లో భాగంగా చినకొండేపూడి చైర్మన్‌గా శేఖర్, డైరెక్టర్లుగా పీ. సురేష్, పద్మనాభం, అలాగే సీతానగరం సహకార సంఘానికి మట్ట వెంకటేశ్వరరావు చైర్మన్‌గా, ముళ్ళ సుబ్బారావు,మట్ట నాగేశ్వరరావు డైరెక్టర్లుగా నియమితులయ్యారు. కార్యక్రమాల్లో వలవల రాజా, కాండ్రు శ్రీనివాసరావు టీడీపీ, జనసేన నేతలు హాజరయ్యారు

ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మనం చేసే పనులు చరిత్రలో నిలిచిపోయేలా ఉండాలని నగర ఎమ్మెల్యే ఆది రెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక సారంగధర మెట్టపై ఉన్న సారంగదేశ్వరస్వామి ఆలయానికి నూతనంగా నియమించబడిన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం జ రిగింది. ఇందులో చైర్మన్‌గా కేవీడీఎస్సీవీ చౌదరి, డెరెక్టర్లుగా కొలచన వెంకట సూర్యనారాయణ, అజ్జరపు శ్యామలాదేవి, సూరంపూడి అప్పా జీ, పొన్నమాటి నాగమణి, దేగల మరియ్య, రేలంగి నాగేశ్వరరావు, కుమారి శాంతకుమారి, నూకల అచ్యుతరామయ్యతో ఆలయ ఈవో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ప్రజలు వారి శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా ఒక కల్యాణ మండపాన్ని నిర్మించనున్నామని తెలిపారు. అందుకోసం తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ. రెండు లక్షల 50 వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వైశ్రీను మాట్లాడారు. నగర టీడీపీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు అధ్యక్ష వహించారు. అలాగే 47వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి బేసరి చిన్ని పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు దొండపాటి సత్యంబాబు, వర్రే శ్రీనివాసరావు,యిన ్నమూరి దీప్తు,నల్లం శ్రీను,ఉప్పులూరి జానకి రామయ్య, మరుకుర్తి రవి యాద వ్,శెట్టి జగదీష్, జామి సత్యనారాయణ, నిమ్మలపూడి గోవిందు, మొకమాటి సత్యనారాయణ, దాస్యం ప్రసాద్, తురకల నిర్మల,పిల్లి శ్యామ్, కందికొండ అనంత్, కానేటి కృపామణి,సలాది ఆనంద్,బొర్రా చిన్ని,కవులూరి వెంకటరావు,చింతపల్లి నాని, మళ్ల వెంకటరాజు, గుదే రఘు నరేష్,దుత్తరపు గంగాధర్, చాపల చిన్నరాజు,కానేటి ప్రభుదాస్, మదీనా సాహెబ్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ టెక్నాలజీపై శ్రద్ధ వహించాలి: వీసీ


ఉన్నత విద్యామండలి వీడియో కాన్ఫరెన్స్‌లో వీసీ, అధికారులు

దివాన్‌చెరువు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నన్నయ విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలు క్వాంటమ్ టెక్నాలజీపై దృష్టిసారించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. క్వాంటమ్ టెక్నాలజీపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించింది. అనంతరం వీసీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. వర్సిటీలోని రెగ్యులర్ ఫ్యాకల్టీలు ఒక్కొక్కరూ ఐదు చొప్పున క్వాంటమ్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. తొలుత వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ కార్యదర్శి కోనశశిధర్ మాట్లాడుతూ అన్ని విశ్వవిద్యాలయాల్లో క్వాంటమ్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి, టీసీఎస్ రీసెర్చ్ గ్రూప్ శ్రీధర్ పలు విషయాలు వివరించారు. సమావేశంలో ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్, నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

రంగంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన భారత్‌ను తయారు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.వి.రమణాంజలి అన్నారు. బుధవారం చంద్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గంటా రమణబాబు అధ్యక్షతన 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటాం - ఆరోగ్యవంతమైన భారత నిర్మాణానికి కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చంద్రేడు, పెదరాయవరం మహిళా పోలీసులు మహమ్మద్, అహ్మద్ ఉనిషాబేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.మహాలక్ష్మీ,ఎం.సుబ్బలక్ష్మీ, పి.సుజాత, ఓ.సీతామహాలక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో ప్రతిజ్ఞ

వెంకటాపురంలో ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ ఎస్.ఎస్.ఎస్.డి.విప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల హెచ్ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు 18న ఢిల్లీలో ధర్నా

దివాన్‌చెరువు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని, మహిళలకు 33.3శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధనకు ఈనెల 18,19తేదీల్లో ఢిల్లీలో మహాధర్నా, సెమినార్ నిర్వహిస్తున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తులనాగేశ్వరరావు (నాగు) తెలిపారు. విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈకార్యక్రమానికి సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడును, ఎంపీలను ఆహ్వానించామన్నారు. ఈకార్యక్రమాలకు బీసీలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి


సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

దివాన్‌చెరువు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకోవాలని ప్రణాళికబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు (వాసు) అన్నారు. భూపాలపట్నంలోని లైట్ కళాశాలలో బుధవారం విద్యా వికాసం అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సాంకేతిక విద్య ప్రాముఖ్యత, అవకాశాలపై విద్యార్థులకు ఎమ్మెల్యే అవగాహన కల్పించారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ సాంకేతిక విద్య, వ్యక్తిత్వ వికాసం ప్రాముఖ్యతను వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాసును, రుడా చైర్మన్ చౌదరిని కళాశాల తరపున ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కళాశాల చైర్మన్ అడ్డాల శ్రీహరి, వైస్‌చైర్మన్ టి.వి.ఎల్.నరసింహారావు, కోశాధికారి రవికిరణ్, ప్రిన్సిపాల్ కె.భాస్కరముత్యాలు, వైస్‌ప్రిన్సిపాల్ ఎం.శ్రీధర్ పాల్గొన్నారు.

ఎలుకలతో అప్రమత్తంగా ఉండాలి: ఏడీఏ


రంగాపురంలో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ కృష్ణ

బిక్కవోలు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తొలకరి సాగులో వరి పొలాలన్నీ బాగా వున్నాయని, అయితే కొన్ని చోట్ల ఎలుకల ప్రభావం ఉందని, ఈవిషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అనపర్తి ఏడీఏ డీవీ కృష్ణ సూచించారు. రంగాపురం, ఇళ్లపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలుకల నివారణా మందును ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. వరి రైతులు ఈనెల15వతేదీలో గాల పంటలకు బీమా చేయించుకోవాలన్నారు. ఏఈవోలు కె.భాస్కరరెడ్డి, కె. శ్రీనివాసు, వీహెచ్ఏ రామకృష్ణ రైతులు పాల్గొన్నారు. అలాగే తొస్సిపూడిలోబుధవారం ప్రకృతి వ్యవసాయ రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణలో ఆల్టర్‌నేటివ్ వెట్టింగ్ అండ్ డ్రైయింగ్ విధానం, దీనికిఅవసరమైన పైప్‌ను ఇన్‌స్టాల్ చేసే విధానాన్ని రైతులకు ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. ఈవిధానం వల్ల వరి పొలాల్లో నీటిని సమర్థవంతంగా వినియోగించడం, భూగర్భ జలాల సంరక్షణ, పంట దిగుబడి పెరుగుతుందని ఎన్ఎఫ్ఏ హరీష్, మాస్టర్ ట్రైనర్ సుధాకర్, యూనిట్ ఇన్‌చార్జి ఈశ్వరకుమార్ వివరించారు.

15నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు

దివాన్‌చెరువు, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి):దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యా నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఈనెల15నుంచి 18వరకు సీబీఎస్ఈ సౌత్‌జోన్-1 బాలుర హ్యాండ్‌బాల్ పోటీలు జరుగుతాయని శ్రీప్రకాష్ విద్యాసంస్థల కరస్పాండెంట్, కార్యదర్శి సీహెచ్.విజయప్రకాష్ తెలిపారు. ఈపోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పాండిచ్చేరి, అండమాన్‌నికోబార్‌దీవులు, తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్న సీబీఎస్ఈ పాఠశాలల నుంచి 1200క్రీడాకారులు, 120కోచ్‌లు, మేనేజర్లు పాల్గొంటారన్నారు. పోటీల పర్యవేక్షణకు ఢిల్లీలోని సీబీఎస్ఈ నుంచి పరిశీలకులు వస్తారన్నారు.

పామాయిల్ మొక్కల పంపిణీ

సీతానగరం,ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): సీతానగరంలోని నేలలు పామాయిల్ తోటలకు అనుకూలమని పతంజలి డీజీఎం ఎస్.ప్రకాష్ అన్నారు. సీతానగరంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, ఆయిల్‌పామ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మొక్కలు పంపిణీ చేశారు. ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను హార్టికల్చర్ అధికారిణి పి.రిని వివరించారు.

ఒకరి అవయవదానంతో పది మందికి ప్రాణం


వైద్యులను సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ ప్రతినిధులు

అనపర్తి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తి చేసే అవయవ దానంతో పది మందికి ప్రాణదానం చేయవచ్చని న్యూరో సర్జన్ డాక్టర్ జమ్ము కోదండరామ్ అన్నారు. బుధవారం ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా పొలమూరులోని శ్రీనివాసమ్ ఫంక్షన్ హాల్‌లో పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవయవదాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వైద్యులు పాల్గొని అవయవదాన విశిష్టతను వివరించారు. గైనకాలజిస్టు డాక్టర్ కె.భాగ్యప్రీతి మాట్లాడుతూ గర్భకోసం వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. యూరాలజిస్టు డాక్టర్ హరీష్ మాట్లాడుతూ కిడ్నీలో వచ్చే రాళ్ల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్యులను అనపర్తి, బిక్కవోలు మండలాల పీఎంపీ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. అసోసియేషన్‌ప్రతినిధులు వాసంశెట్టి నాగేశ్వరరావు, బళ్లా శ్రీనివాసరావు, చిన్ని, డి.సాయి రామారెడ్డి, నీలంశెట్టి శ్రీనివాస్, బాలసుబ్రహ్మణ్యం, సాగి సూర్యనారాయణరాజు,నరేంద్రరెడ్డిపాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

రంగంపేట,ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఈలకొలను శ్రీసత్యసాయి సమాజ సేవాకేంద్రంలో బుధవారం వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యాలయం సహకారంతో తిక్కిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని శ్రీసత్యసాయి సేవాదళ్ సహాయసమన్వయకర్త తిక్కిశెట్టి గోవిందరాజు ప్రారంభించారు. 90మందిని పరీక్షించారు. 8మందిని ఆపరేషన్లకు ఎంపికచేశారు. కళ్లజోళ్లు అందిస్తామని సమన్వయకర్త చంటి తెలిపారు.

కోరుకొండ పీఏసీఎస్ కమిటీ ప్రమాణస్వీకారం


కోరుకొండ పీఏసీఎస్ నూతన త్రిమెన్ కమిటీ ప్రమాణస్వీకార దృశ్యం

కోరుకొండ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కోరుకొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన త్రిమెన్ కమిటీ చైర్మన్‌గా బత్తుల గోపాలకృష్ణ, సభ్యులుగా సుంకర శ్రీనివాసు,దేవన దుర్గాప్రసాద్ బుధవారం కోరుకొండ పీఏసీఎస్ కార్యాలయం వద్ద ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో సొసైటీ సీఈవో ఆకుల వెంకటరమణ, జి.సుధాకర్ వర్మలు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకుడు డాక్టర్ అడపా శ్రీనివాస్, కోరుకొండ సర్పంచ్ కర్రి వీరగణేష్, జనసేన మండల కన్వీనర్ అడ్డాల శ్రీనివాస్, గాదరాడ సర్పంచ్ దూది కాంతారావు, నర్సాపురం ఎంపీటీసీ వీతా శ్రీనుబాబు, టీడీపీ నాయకుడు పెదపాటి భీమరాజు,సొసైటీ సిబ్బంది వీరయ్యదొర, రవికుమార్, సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నేడు సహకార సంఘాల ప్రమాణ స్వీకారోత్సవం

రాజానగరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు నూతనంగా నియమితులైన చైర్మన్ల ప్రకాణ స్వీకార మహోత్సవం గురువారం రాజానగ రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బత్తుల బలరా మకృష్ణ బుధవారం తెలిపారు. జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విశ్వశాంతి సాధనకు ధ్యాన సాధన

రంగంపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి సాధనకు మూడు రోజులు ధ్యాన సాధన చేయాలని రంగంపేట శ్రీదుర్గమాంబ పిరమిడ్ సొసైటీ ధ్యాన కేంద్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు ఉండవిల్లి భ్రమరాంబిక కోరారు. బుధవారం స్థానిక పిరమిడ్ కేంద్రంలో ఆమె మాట్లాడారు. ఈనెల 18, 21వ తేదీల్లో మధ్యాహ్నం శక్తివంతమైన సంకల్పం, సామూహిక విజువలైజేషన్ ద్వారా ధ్యానసాధన ద్వారా సమాజ శ్రేయస్సు సాధ్యమవుతుందన్నారు. వయో, లింగ భేదం లేకుండా అందరూ భాగస్వాములు కావాలని ఆమె కోరారు. విశ్వశ్రేయస్సు కొరకు గంట సామూహిక ధ్యానం చేశారు. పిరమిడ్ సొసైటీ సభ్యులు స్వర్ణలక్ష్మీ, దుర్గ, నాగమణి, లక్ష్మీశ్రీనివాస్, వరలక్ష్మీ, సత్యవాణి పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 14 ఆగస్టు 2025 | 5




నగరంలో ముంచిన వాన

వరదలా వాన!

4 గంటల పాటు ఏకధాటిగా వర్షం




రాజమహేంద్రవరంలో వర్షంలోనే వాహనదారుల ప్రయాణం

కలెక్టరేట్	89779 35611
ఆర్డీవోరాజమండ్రి	0883 2442344
కార్పొరేషన్	94940 60060
ఆర్డీవో కొవ్వూరు	08813 231488
మునిసిపాలిటీ	08813 231557

రాజమహేంద్రవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వరుణుడు దంచికొట్టాడు.. కరువుతీరా ముంచేశాడు.. వర్షాకాలమైనా గత నెల రోజులుగా సరైన వర్షాల్లేవ్..మరో పక్క తీవ్ర ఎండలతో జనం ఆపసోపాలు పడ్డారు. ఇదిలా ఉండగా ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరానికి సమీపంగా అల్పపీడనం ఏర్పడడంతో ఈ నెల 13, 14 తేదీల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం సమయంలో భారీ వర్షం కురిసింది. వర్షాకాలం అయినప్పటికీ జూలై, ఆగస్టు నెలలో పెద్దగా వర్షాలు పడలేదు. ఆకాశం మబ్బులు కమ్మినప్పటికీ కొద్ది పాటి చినుకులుతోనే గడిచిపోయింది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 7 గంటల వరకు ఎడతెడపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎండలతో సతమతమైన ప్రజానీకం వాతావరణం చల్లబడడంతో సేద తీరారు. వానాకాలంలో చినుకు రాక కోసం ఎదురు చూస్తున్న జనాలకు ఉపశమనం కలిగింది. వర్షాకాలం ప్రారంభమైనా చెదురుమదురు తప్ప పెద్దగా వర్షం కురిసిన దాఖలాలు లేవు. ఆ వాన కూడా ఒక ప్రాంతంలో ఉంటే మరో ప్రాంతంలో ఉండేది కాదు. అయితే బుధవారం ఉదయం ఎండ కాసినా మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా చల్లబడింది. జిల్లా వ్యాప్తంగా భారీగానే వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ప్రశాంతి ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు. ఏటి గట్లు, లోతట్టు ప్రాంతాలు, విద్యుత్ స్తంభాలు వంటి వాటి వద్ద అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాల్లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు రాజమండ్రి, కొవ్వూరు ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. మూడు షిఫ్టుల్లో ఉద్యోగులు నిరంతరం విధులు నిర్వర్తించే విధంగా చర్యలు తీసుకున్నారు. విపత్తు నిర్వహణ శాఖ సాధనా సంపత్తిని సిద్ధం చేసుకొంది.వ్యవసాయ అధికారులు అప్రమత్తమయ్యారు. గోదావరి లంకల్లోని నివాసితులను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో జరగాల్సిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మరో సురక్షితమైన వేదికలో నిర్వహించడానికి అధికారులు పరిశీలన చేస్తున్నారు. మరోవైపు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. అవసరం లేకపోతే బయటకు రాకుండా ఉండాలన్నారు. పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. జిల్లా యంత్రాంగానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వర్షాల వల్ల ప్రజలకు సమస్యల ఏర్పడితే వెంటనే వారి పరిధిలోని కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం కురిసిన జోరు వానకు జిల్లా కేంద్రంలోని రోడ్లు నీటితో నిండిపోయాయి. కంబాల చెరువు,తాడితోట, తుమ్మలావ, ఆర్యాపురం ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

పది మండలాల్లో కంట్రోల్ రూమ్‌లు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పది మండలాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకూ వర్షాలు, గాలులు వంటి వాతావరణ పరిస్థితులు, మార్పులను దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సాయం అందించేందుకు కంట్రోల్ రూమ్‌లు 24 గంటలు సిద్ధంగా ఉంటాయన్నారు. ప్రజలు ఏ అవసరం వచ్చినా కంట్రోల్ రూంలను సంప్రదించవచ్చని తెలిపారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం 0883-2442344, అనపర్తి 94413 86920, బిక్కవోలు 98499 03913, గోకవరం 9491380560, కడియం 94908 84561, కొవ్వూరు 9866778416, రాజమహేంద్రవరం రూరల్ 0883 2416005, రాజమహేంద్రవరం అర్బన్ 0883 2940 695,రాజానగరం 94945 46001, రంగంపేట 91778 24924, సీతానగరం 9177096888 నెంబర్లలో సంప్రదించాలన్నారు.



బ్యాంకర్లు 18 నుంచి రుణమేళాలు నిర్వహించాలి

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం రూరల్, (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లోను ఆగస్టు 18వ తేదీ నుంచి సీసీఆర్సీ కార్డుదారుల రుణమేళా నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో సీసీఆర్సీ కార్డులు కలిగిన కౌలు రైతులకు రుణాల మంజూరు విషయమై బ్యాంకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రుణమేళాల ద్వారా సీసీఆర్సీ కార్డు కలిగిన ప్రతి కౌలు రైతుకు ఖచ్చితంగా పంట రుణం అందించాలన్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 1.10 లక్షలు సీసీఆర్సీ కార్డులను అందించాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 57,107 కార్డులు మంజూరు చేశామన్నారు. వీరిలో ఇప్పటి వరకు 3,438 మంది రైతులు మాత్రమే పంటరుణాలు పొందారన్నారు.సీసీఆర్సీ కార్డుదారుల వివరాలను వ్యవసాయాధికారులు సంబంధిత బ్యాంకర్లకు అందించాలని ఆదేశించారు. రానున్న రెండ్రోజుల్లో పంట రుణాలకు దరఖాస్తులు పూర్తిచేసేందుకు క్షేత్ర స్థాయిలో వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సహాయకులు బాధ్యత వహించాలన్నారు. వ్యవసాయాధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి రోజూ కలెక్టర్ లేదా జేసీ, నోడల్ అధికారులు వ్యవసాయాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తామన్నారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద రాయితీపై సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకునేవారికి రుణాలు మంజూరుచేయాలన్నారు.

కూర్చుని.. తాగండి!



మొత్తం 455 షాపులు

తూర్పు గోదావరిలో 138, కాకినాడ జిల్లాలో 171, కోనసీమ జిల్లాలో 146 ప్రైవేటు మద్యం దుకాణాలు ఉన్నాయి. మొత్తంగా 452 మద్యం షాపులు 43 బార్లు ఉన్నాయి.ప్రభుత్వం బార్లకు మినహా అన్ని షాపులకూ పర్మిట్ రూంల అనుమతిస్తుంది. పర్మిట్ రూంల ద్వారా ఏడాదికి ప్రభుత్వ ఖజానాకు రూ.30 కోట్ల వరకూ జమ కానుంది. అలాగే మద్యం రాబడి పెరిగే అవకాశం ఉంది.

మద్యం షాపులకు పర్మిట్ రూమ్‌లు

- ఉమ్మడి జిల్లాలో 455 దుకాణాలు
- రూ.5 లక్షలు, రూ.7.50 లక్షల ఫీజు
- రూ.30 కోట్ల వరకూ ఆదాయం
- ప్రభుత్వ జీవో విడుదల
- మందుబాబుల ఆనందం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం మద్యం షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎక్సయిజ్ చట్టంలోని సెక్షన్ 24 (ఏ)ను అదనంగా చేర్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పలు రాష్ట్రాల్లో అధ్యయనం తర్వాత కొత్త మద్యం పాలసీని అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేటు మద్యం షాపులకు అనుమతిచ్చింది. జగన్ జమానాలో పిచ్చి బ్రాండ్లకు అడ్డుకట్ట వేసింది. దాదాపు 200 రకాల నాణ్యమైన బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చింది. జగన్ జమానాలో రాష్ట్రాన్ని వదిలి పారిపోయిన కంపెనీలు మళ్లీ తిరిగొచ్చాయి.అయితే.. ఆ మేరకు ఆదాయం సమకూరకపోవడంతో పాటు మద్యం తాగే విషయంలో మందుబాబులు ఇబ్బందులు పడుతుండడం.. బహిరంగ మద్యం పానంపై విమర్శలు రావడం వంటి అంశాలపై ప్రభుత్వం నివేదికలు రప్పించుకొని విశ్లేషణ చేసింది.పర్మిట్ రూమ్‌లు లేకపోవడమే ఇబ్బం దేనిని స్పష్టమైంది.దీంతో పర్మిట్ రూమ్‌లకు అనుమతిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది.

అనుమతి ఇలా ఇస్తారు..

మద్యం షాపుల పక్కన మద్యం తాగడానికి రూమ్‌లను అనుమతిస్తూ ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం. 273ను జారీ చేసింది. దరఖాస్తు చేసుకున్న మద్యం షాపులకు(ఏ4) పర్మిట్ రూమ్‌ను మంజూరు చేస్తారు. ఏడాదికి రూ.55 లక్షల్లోపు మద్యం షాపునకు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ చెల్లించే వాళ్లకు రూ.5 లక్షలు, ఆపై రూ.85 లక్షల వరకూ రూ.7.50 లక్షల వార్షిక లైసెన్సు రుసుం కింద నిర్ణయించారు. 2019కి ముందు టీడీపీ హయాంలో ఉన్న ఫీజునే ఇప్పుడూ పెట్టారు. ఈ రుసుం చెల్లించిన వారికి అనుమతి మంజూరు చేస్తారు. పర్మిట్ రూంలో వంట చేయడానికి వీల్లేదు.షాపు సమయం ప్రకారమే పర్మిట్ రూం తెరిచి ఉంచాలి. భద్రత, పరిశుభ్రత చర్యలూ తీసుకోవాలి. ఎక్సైజ్ కమిషనరేట్ నుంచి పూర్తి ఆదేశాలు రావాలని ఎక్సైజ్ అధికారులు చెప్పారు.

తాగడానికి తిప్పలు తప్పాయ్..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాణ్యమైన బ్రాండ్లు అందుబాటులోకి వచ్చినా.. ధరలు తగ్గినా.. చుక్కేసుకోడానికి చోటుకు మందు బాబులు తిప్పలు పడేవాళ్లు. కిళ్లీ బడ్డీల దగ్గర, చాటుమాటు ప్రదేశాల్లో తాగడం జరిగేది. పోలీసులు, ఎక్సైజ్ వాళ్ల కంటబడితే జరిమానా, కేసు లేదా 'ఎంతో కొంత' వదిలేది. ప్రైవేటు మద్యం షాపులు వచ్చినా తాగడానికి పెద్ద తతంగమే ఉండేది. ఇప్పుడు పర్మిట్‌రూమ్‌లు ఇవ్వడంతో ఆ ఇబ్బందులు తప్పనున్నాయి. బార్‌లలో అదనపు ధరలు వసూలు చేస్తుండడం, పరిశుభ్రత పట్టించుకోకపోవడం వంటి కారణాలతో మద్యం షాపుల్లోనే చుక్కేసుకోవడానికి మందుబాబులు మొగ్గు చూపుతున్నారు. అయితే పర్మిట్ రూమ్‌లు లేక ఇబ్బందిగా ఉండేది. వైసీపీ ప్రభుత్వంలో బార్‌లకు లైసెన్సు ఫీజును రెండేళ్లకు జమ చేసుకొంది. వాళ్లకు ఈ ఏడాది ఆగస్టు వరకూ సమయం ఉంది. దీంతో కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చినా రాబడిలో కూడా పెద్దగా ఫలితం కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చినా కొత్త బార్ పాలసీలో మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకున్నారు. అంటే ఆ మండలానికి కేటాయించిన షాపులు మండల పరిధిలో ఎక్కడైనా పెట్టుకోవచ్చు.మండల కేంద్రాల్లో జన సంచారం ఎక్కువగా ఉంటుందని అక్కడే షాపులు పెట్టారు.కాస్త పెద్ద గ్రామాల్లో సైతం మద్యం దుకాణం అందుబాటులోకి రాలేదు.ఇది కూడా రాబడిపై ప్రతికూల ప్రభావం చూపింది. ఇప్పుడు పర్మిట్ రూంలు ఇవ్వడంతో ఆ సమస్యలు తీరనున్నాయి.పెద్ద గ్రామాల్లో మినీ మద్యం షా పులు ఏర్పాటు చేయాలని మందుబాబులు కోరుతున్నారు.

రూ.20 లక్షలు

ఏమయ్యాయి!

- వెంకటనగరం పంచాయతీలో అవినీతి ఆరోపణ
- గత కార్యదర్శి రాజానగరం బదిలీ
- నెలన్నర దాటినా కొత్త కార్యదర్శికి నో చార్జి
- పట్టించుకోని ఉన్నతాధికారులు

రాజమహేంద్రవరం రూరల్ జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రూరల్ మండలం లోనే అది ఒక మైనర్ పంచాయతీ..ఆదాయం చూస్తే సుమారు అర కోటి.. పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల ప్రకారం అధికారులు చేపడుతున్న రీ-ఎసెస్‌మెంట్ల విషయంతో అధికారులు చిత్తశుద్ధితో పన్నులు మదింపు చేస్తే మరో రూ.20 నుంచి రూ.25 లక్షల అదనంగా చేకూరుతుందని పలువురు చెబుతున్న మాట. అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పంచాయతీ నిధులు పక్కదారి పడుతున్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం వెంకటనగరం పంచాయతీలో సుమారు 945 ఎసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 905 ఎసెస్‌మెంట్లకు పన్నులు వేసినట్టు సమాచారం.ఇక్కడ గ్రామ కార్యదర్శిగా పని చేసిన రాణి బదిలీపై రాజానగరం మండలం వెళ్లారు. సుమారు నెలన్నర కావొస్తున్నా నేటికి కొత్తగా విధుల్లో చేరిన కార్య దర్శికి పూర్తిస్థాయిలో చార్జి కూడా అప్పగించలేదు.పంచాయతీకి రావాల్సిన పన్నులు, బిల్డింగ్ పన్నులు పంచాయతీ ఖాతాకు జమచేయకుండా సుమారు రూ.20 లక్షలు గత కార్యదర్శి దుర్వినియోగం చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రస్తుత కార్యదర్శికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించ లేదని సమాచారం.ఈ మేరకు సమాచారం అందినా ఉన్నతాధికారులు మిన్న కుండిపోయారు.నేటి వరకూ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. బదిలీపై వెళ్లిన వారు కొత్తగా విధుల్లోకి చేరిన వారికి పంచాయతీకి సంబంధించిన చార్జి అప్పగించాల్సిందేనని డీపీవో శాంతామణి, డీఎల్‌పీవో నాగలత చెబుతున్నారే తప్ప, దీనిపై ఎలాంటి స్పందనా లేదు.దీనిపై అనుమానాలు వెల్లు వెత్తుతున్నాయి.చిన్న గ్రామమైన వెంకటనగరంపై కలెక్టర్ దృష్టి సారిస్తే జనాభా ప్రాతిపదికన కాకుండా ఆదాయం ప్రాతిపదికన గ్రేడ్-1 పంచాయతీల లిస్టులో చేరుతుందని ఆ పంచాయతీ మాజీ ఉద్యోగులే చెబుతున్నారు.

రైతులకు సహకారమేది!

- గత వైసీపీలో సొసైటీలు దోపిడీ
- నాటి నుంచి మారిన తీరు
- గత 12 ఏళ్లగా ఎన్నికల్లేవ్
- 101 సొసైటీలకు త్రీమెన్ కమిటీలు
- ప్రమాణస్వీకారాలతో జోష్
- పెండింగ్‌లో ఆరు సొసైటీలు
- ఎన్నికలకు రైతుల డిమాండ్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్)కు సొసైటీలకు కొత్త పాలకవర్గాలు వచ్చాయి.2013లో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్)కు ఎన్నికలు జరిగాయి. తర్వాత వాటికి ఎన్నికలు నిర్వహించలేదు. ఒక్కో సంఘంలో 12 మంది సభ్యులు ఉండేవారు. జిల్లాలో రూ.15 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకూ టర్నోవర్ ఉన్న సొసైటీలు ఉన్నాయి.గతంలో సొసైటీలు రైతుల సౌకర్యార్థం పని చేసేవి. ప్రస్తుతం చాలా సొసైటీల్లో అక్రమాలు పెరిగాయి.వీటిని సక్రమంగా నడిపిస్తే ఆయా సొసైటీల పరిధిలోని రైతులు అప్పులకు ఎరువులు వ్యాపారులు, మిల్లర్ల వద్దకు పరుగులు పెట్టాల్సిన అవసరం లేదు. సొసైటీలకు 2013లో ఎన్నికలు జరిగాయి. తర్వాత ఇప్పటి వరకూ జరగలేదు. దీంతో ఆయా సొసైటీల్లో పనిచేసే అధికారులు,ఉద్యోగులు ముదిరిపోయారు. రాజకీయనేతలను ప్రభుత్వాలే నేరుగా పాలకవర్గాలుగా నియమించడం వల్ల కూడా కొందరు బరి తెగిస్తు న్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టి సొసైటీలకు పూర్వ వైభవం తీసుకురావాల్సి ఉంది.త్వరలో ప్రభుత్వం సొసైటీ ఎన్నికల దిశగా ఆలోచించాలని రైతులు, సొసైటీ సభ్యులు కోరుతున్నారు.

అవినీతికి సహకారం

ప్రస్తుతం జిల్లాలో పలు సొసైటీల్లో జరిగిన అక్రమాలపై 51 ఎంక్వయిరీ జరుగుతోంది. వెదుళ్లపల్లి లో ఇప్పటికే రూ.1 కోటి 10 లక్షల వరకూ అవినీతి జరిగినట్టు సహకార అధికారులు ధ్రువీకరించారు. ఇది రూ.2 కోట్ల వరకూ చేరవచ్చనే అంచనా ఉంది. శ్రీరంగపట్నంలో రూ.5 కోట్ల అక్రమాలను ధ్రువీకరించారు.ఇక్కడ క్రిమినల్ కేసు నడుస్తోంది. మురమండ సొసైటీలో కూడా 51 ఎంక్వయిరీ జరుగుతోంది. సుమారు రూ.50 లక్షల వరకూ అవినీతి జరిగి ఉండొచ్చనే ప్రచారం ఉంది. ఇలా జిల్లావ్యాప్తంగా చాలా సొసైటీల్లో అక్రమాలు జరుగుతున్నాయి.

101 సొసైటీలకు త్రీమెన్ కమిటీలు

జిల్లాలో 107 సొసైటీలు ఉన్నాయి. ఇప్పటి వరకూ 101 సొసైటీలకు త్రీమెన్ కమిటీలను నియమించారు. అధికంగా టీడీపీ వర్గాలకు రాగా, కొన్ని జనసేనకు, కొద్దిగా బీజేపీకి దక్కాయి.ఒక్కో కమిటీలో ముగ్గురు ఉండడం వల్ల 107 సొసైటీలకు త్రిమెన్ కమిటీలను నియమిస్తే 321 మందికి నామినేటెడ్ పదవులు దక్కినట్టు అవుతుంది. ఇంకా ఆరు కమిటీలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటికి కూడా పేర్లు ప్రతిపాదించారు. శ్రీరంగపట్నంలో ప్రతిపాదించిన ఒకరి పేరు మరో సొసైటీలో కూడా ఉండడంతో దానిని మార్చి మరో పేరు పంపించారు. నల్లజర్ల, వెదుళ్లపల్లి, మిర్తిపాడు, రాపాక, ఉండేశ్వరపురం,శ్రీరంగపట్నం సొసైటీల త్రీమెన్ కమిటీలు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం నియమించిన త్రీమెన్ కమిటీలన్నీ వచ్చే జనవరి 30వ తేదీ వరకూ అధికారంలో ఉంటాయి. అప్పటి లోపు ఎన్నికలు జరిగితే కొత్త పాలకవర్గాలు వస్తాయి.

దివ్యాంగులతో సదరంగం!

సదరం సర్టిఫికెట్ల పరిశీలనకు వెళ్లారా ఉదయం నుంచి సాయంత్రం వరకూ అష్టకష్టాలే.. దివ్యాంగులు అన్న కనికరం ఉండదు.. అయ్యో పాపం అన్న జాలి ఉండదు.. కనీసం పట్టించుకునేవారు ఉండరు.. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది.. స్లాట్ బుక్ చేసుకుని దివ్యాంగులకు వచ్చిన రోజు ఆసుపత్రికి చేరుకుంటున్నారు. అయితే వచ్చినప్పటి నుంచి వెళ్లే వరకూ ఇంతే. కూడా ఎవరైనా వస్తే సరి లేదంటే ఒక పట్టాన తెవలదు.. బుధవారం కూడా సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరిగింది. ఉదయం నుంచి ఇలా బారులుతీరి కనిపించారు. ఎప్పుడు తమ వంతు వస్తుందా అంటూ చాలా సమయం చూస్తూనే ఉన్నారు.. అయ్యా వైద్యాధికారులు వారు దివ్యాంగులు అనే మాట గుర్తుపెట్టుకోండి సార్.. ఇకనైనా కాస్త వెసులుబాటు కల్పించండి మరి.


సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన దివ్యాంగుల క్యూలు

- ఫొటోగ్రాఫర్ - రాజమహేంద్రవరం


తోకాడలో జరిగిన సభకు హాజరైన రైతులు, కలెక్టర్, ఇతర అధికారులు

భూ వివాదాల నిర్మూలనలో రీ-సర్వే కీలకం

తోకాడలో జరిగిన రీ-సర్వే ఫైనల్ ఆర్‌వోఆర్ సభలో కలెక్టర్

రాజానగరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : భూవివాదాల నిర్మూనలో రీ-సర్వే కీలక భూమిక పోషిస్తుందని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రీ-సర్వే ప్రాజెక్టు ఫేజ్-లో భాగంగా ఇటీవల జారీ చేసిన 13వ నోటిఫికేషన్ ప్రకారం రాజానగరం మండలం తోకాడ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఫైనల్ ఆర్‌వోఆర్ గ్రామ సభకు జిల్లా కలెక్టర్ ప్రశాంతి హాజరై మాట్లాడారు. రీ-సర్వే ప్రక్రియ భూహక్కులు స్పష్టత రావడం, భూవివాదాలు తగ్గడం, రికార్డుల ఖచ్చితత్వానికి దోహద పడుతుందన్నారు.రీ-సర్వే ప్రక్రియపై అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 658 సర్వే నెంబర్లకు 3410 ఎల్‌పీఎం డీఎల్‌ఆర్ పబ్లికేషన్ చేశామన్నారు. గ్రామ విస్తీర్ణం 4674.19 ఎకరాలు ఉండగా రీ-సర్వే అనంతరం 4654.969 ఎకరాలు నిర్ధారించబడిందన్నారు. ప్రభుత్వ భూమి సర్వే నంబర్లు 147(341.65)ఎకరాలు ఉండగా రీ-సర్వే అనంతరం 341.052 ఎకరాలు ఖరారైనట్లుగా చెప్పారు. ప్రైవేట్ భూమి సర్వే నెంబర్ల 415(4332.54) ఎకరాలు ఉండగా రీసర్వే అనంతరం 4313.91 ఎకరాలు నమోదైనట్టు చెప్పారు. మొత్తం ఖాతాలు 1938 నుంచి 1924కు తగ్గినట్లుగా వెల్ల డించారు. గ్రామ సభలో రీసర్వే అధికారి మోహన్‌రావు, తహశీల్దార్ జి.అనంత లక్ష్మీ సత్యవతి దేవి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవం ఎక్కడ?

ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాట్లు - వర్షాలతో అయోమయం


స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముస్తాబవుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం

రాజమహేంద్రవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి):భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు ప్రత్యామ్నాయ వేదికను పరిశీలిస్తున్నామని జేసీ చిన్న రాముడు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాట్లు చేశామని.. సుబ్రహ్మణ్య మైదానం వంటి ప్రదేశాలను పరిశీలిస్తున్నామన్నారు. కలెక్టర్ ప్రశాంతి తుది నిర్ణయం తీసుకుంటారన్నారు.ఈ మేరకు జేసీ చిన్నరాముడు, అడిషనల్ ఎస్పీలు మురళీ కృష్ణ, చెంచురెడ్డి,అర్జున్, ఆర్డీవో కృష్ణ నాయక్,డీఎస్పీ రవికుమార్ తదితర అధికారులతో కూడిన బృందం బుధవారం సుబ్రహ్మణ్య మైదానాన్ని పరిశీలించింది.

ప్రతి ఒక్కరికీ జాతీయభావం అవసరం : చైర్‌పర్సన్



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి, ఆర్డీవో, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు

కొవ్వూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ జాతీయభావాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు బుధవారం కొవ్వూరు మున్సిపాల్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. దీన్ని చైర్‌పర్సన్ రత్నకుమారి ప్రారంభించి మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. అనంతరం జాతీయ జెండాలోని మూడురంగుల విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. మున్సిపల్ కమిషనర్ జీ.సందీప్, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జే.సునీత, ఆర్ఐ శ్యామ్, ఏఈ సుమంత్, మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ, మెప్మా సిబ్బంది, ఏబీఎన్ కళాశాల, జూనియర్ కళాశాల, గర్ల్స్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటరత్నం కుటుంబానికి పరామర్శ


సోవమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

నల్లజర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మాజీ ఎంపీటీసీ కండెపు వెంకటరత్నం తల్లి, శతాధిక వృద్ధురాలు కండెపె సోవమ్మ (101) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు బుధవారం వెంకటరత్నం ఇంటికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం పలు విషయాలపూ మాట్లాడారు. ఆయన వెంట టీడీపీ జిల్లా కార్యదర్శి కూచిపూడి ఉదయభాస్కరరావు, దూబచర్ల ఎంపీటీసీ ఈడే శ్రీను, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరా సాహెబ్, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు రావూరి వెంకటరమణ ఉన్నారు.

ప్లాస్టిక్ కవర్లను నిషేధించండి


షాపుల్లో తనిఖీలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

తాళ్లపూడి, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై అవగాహన కల్పిస్తూ తాళ్లపూడిలో బుధవారం పంచాయతీ సిబ్బంది పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ, తాళ్లపూడి కార్యదర్శి వీరన్న మాట్లాడుతూ తక్కువ మైక్రాన్స్ గల ప్లాస్టిక్ బ్యాగ్‌లు, కవర్లు, గ్లాసుల అమ్మకాలను నిలిపివేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో కుకునూరు కార్యదర్శి అనురాధ, నాయుడు రాజు, ఎస్. గిరిబాబు, మహిళా పోలీసు సంధ్యారాణి, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గోఆధారిత కొబ్బరి సాగుతో లాభాలు


సింగరాజుపాలెంలో కొబ్బరి సాగును పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

నల్లజర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గోఆధారిత కొబ్బరి సాగు రైతులకు ఎంతో లాభసాటిగా ఉంటుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎన్. మల్లిఖార్జునరావు పేర్కొన్నారు. బుధవారం శింగరాజుపాలెంలో రైతు గద్దె సతీష్ కొబ్బరి వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు. కేవలం గోమూత్రం, పశువుల పేడతో మాత్రమే సాగు చేయడం ద్వారా తెల్లదోమ, పిందె రాలడం, సూక్ష్మ పోషక లోపాలను నివారిస్తుందని గుర్తించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారిణి బబిత, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన సంఘం

నిడదవోలు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం సమిశ్రగూడెంలో జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా తిరుమళ్ల గోపాలకృష్ణ, అధ్యక్షుడిగా కుంచాల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా వి.భార్గవి దేవి, కేవీ సుబ్బన్న, జనరల్ సెక్రటరీగా కె.విజయరాజు, జాయింట్ సెక్రటరీగా ఎం.రాంబాబు, ట్రెజరర్లుగా బి.మనోజ్, కే.రమేష్, ఉప ట్రెజరర్లుగా జి.కొండలరావు, బీ.భీమేశ్వరరావు ఎన్నికయ్యారు. వీరంతా ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జగన్నాథరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చాగల్లు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎం.మెరికమ్మ బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా స్థానిక వీఆర్‌వోకి తెలియజేయాలని సూచించారు. వ్యవసాయదారులు, పొలాల్లోకి వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రేపటి నుంచి ఉచిత బస్సు ప్రయాణం

మహిళలంతా అర్హులే : మంత్రి దుర్గేష్


నిడదవోలులో పీ4పై మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా శుక్రవారం నుంచి అమలు చేయనున్న ఉచిత బస్సు ప్రయాణానికి మహిళలందరూ అర్హులేనని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో పీ4పై నియోజకవర్గ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మహిళలు నాన్‌స్టాప్, ఇతర రాష్ట్రాల మధ్య తిరిగే అంతర్‌రాష్ట్ర బస్సు సర్వీసులు మినహా మిగతా పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్, తదితర ఐదు కేటగిరీల్లోని బస్సుల్లో ఎటువంటి చార్జీ లేకుండా ఉచితంగా ఎక్కడ నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చన్నారు. ప్రజలందరికీ మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అలాగే సమాజం బాగుండాలన్న సంకల్పంతో పేదరికం లేని సమాజం కోసమే సీఎం చంద్రబాబు పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్ (పీ4) విధానం తీసుకువచ్చారని అన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 7862 మంది బంగారు కుటుంబాలను 19,901 మంది బంగారు కుటుంబాల్లోని వ్యక్తులను 685 మంది మార్గదర్శకులను గుర్తించడం జరిగిందన్నారు. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి కె.సతీష్, ఎం.సునీల్ కుమార్, ఎంపీడీవో జగన్నాధరావు, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, తహశీల్దార్ బి.నాగరాజు నాయక్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా టీజర్ విడుదల

సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు కావాలనే సందేశాత్మకంగా చిత్రీకరించిన మత్తురా సినిమా ఘన విజయం సాధించాలని మంత్రి దుర్గేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. కార్యక్రమంలో నిర్మాత ఎద్దుల రాజారెడ్డి, దర్శకుడు పువ్వుల చలపతి, బోణం మనోజ్ కుమార్, అనుదీప్, అజయ్, సుహానా, వేదిక, తదితరులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

ప్రతిఒక్కరిలోనూ దేశభక్తిని పెంపొందించి స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొనాలని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.

రూ.25 కోట్లతో కొత్త రోడ్లకు మోక్షం

ఉండ్రాజవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు నియోజకవర్గంలో రూ.25 కోట్లతో కొత్త రోడ్లు త్వరలో వేస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. బుధవారం తాడిపర్రులో వడ్లూరు-తీపర్రు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. దీనికి రూ. 3.24 లక్షల నాబార్డు నిధులు కేటాయించామన్నారు. అలాగే నాలుగు గ్రామాలను అనుసంధానం చేస్తూ 9.6 కిలోమీటర్ల వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డును సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం తాడిపర్రు నుంచి వెలగదుర్రు వరకు అన్నదాత సుఖీభవ విజయయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లపై మంత్రి దుర్గేష్, ఏపీ స్కిల్‌డవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ర్యాలీ నిర్వహించారు. రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం వెలగదుర్రులో రూ.24 లక్షలతో నిర్మించిన ఎస్సీ సామాజిక భవనాన్ని మంత్రి దుర్గేష్, బూరుగుపల్లి కలిసి ప్రారంభించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే మద్దిపాటి



గోపాలపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు బుధవారం మంగళగిరిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల నియోజక వర్గంలో సుపరిపాలనలో తొలిఅడుగు, ఏడాది పండుగ నిర్వహించిన తీరుపై మంత్రి ప్రశంసించారన్నారు.

కోట సత్తెమ్మ ఆలయంలో చండీహోమం

నిడదవోలు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) :తిమ్మరాజుపాలెంలో వేంచేసివున్న కోట సత్తెమ్మ వారి ఆలయంలో బుధవారం శ్రావణ మాసం సందర్భంగా సాయంకాలం చండీహోమాన్ని నిర్వహించారు. ప్రతిరోజు సాయంకాలం ఈ హోమం జరుగుతుందని రూ. 1116 చెల్లించిన దంపతులు పాల్గొనవచ్చునని ఆలయ సహాయ కమిషనర్ వి. హరి సూర్యప్రకాష్ తెలిపారు

మోటారుసైకిల్ ఢీకొని వ్యక్తికి గాయాలు

కొవ్వూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిల్ ఢీకొని వ్యక్తి గాయపడినట్టు కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి .. పశివేదలకు చెందిన కండెల్లి రాజేష్ రాజమహేంద్రవరంలో కాంట్రాక్టు విభాగంలో రైల్వే వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 3వ తేదీన ప్రతిరోజు మాదిరిగా డ్యూటీకి వెళ్లి తిరిగి వస్తుండగా.. పశివేదల మల్లవరం మలుపు వద్ద ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సొసైటీల అభివృద్ధికి కృషి చేయాలి

ఉండ్రాజవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సొసైటీల అభివృద్ధికి త్రిసభ్య కమిటీలు కృషి చేయాలని ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుపేర్కొన్నారు. బుధవారం చివటంలో జరిగిన త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం సొసైటీలను బలోపేతం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. టీడీపీ నాయకులు పరిమి వెంకన్నబాబు, ఎం. పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు. ఉండ్రాజవరం, మోర్త, సూర్యారావుపాలెం సొసైటీల త్రిసభ్య కమిటీలు కూడా ప్రమాణ స్వీకారం చేశాయి.

విజిలెన్స్ తనిఖీలు

గోపాలపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణాల్లో విజిలెన్స్ బృందాలు ఏకకాలంలో బుధవారం విజిలెన్స్ సీఐ మధుబాబు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో షాపునెంబర్ 2,4,5 ఏకకాలంలో తనిఖీలు నిర్వహించగా నాలుగు, ఐదు దుకాణాల్లో స్టాకు రికార్డుకు సరిపోయిందన్నారు. అదే విధంగా షాపు నెంబర్- 2లో రికార్డుల ప్రకారం గోదాములో ఉంచిన స్టాకుకు సంబంధించి 6 కేజీల పంచదార ఎక్కువగా ఉందని విజిలెన్స్ సీఐ మధుబాబు తెలిపారు. దీంతో నిల్వలకు, అమ్మకాలకు మించి పంచదార ఉండటంతో షాపు యాజమాని పై 6ఏ కేసు నమోదు చేసి దాని నిర్వహణను ఇన్‌చార్జి అప్పగించాలని సీఎస్ డీటీకి ఆదేశాలు ఇచ్చామన్నారు. దాడుల్లో సీఎస్ డీటీ దివాకర్, డీసీసీఓ నవీన్‌కుమార్, కానిస్టేబుల్ లోవరాజు, వీఆర్వో లక్ష్మి, తదితరులు ఉన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

తాళ్లపూడి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ లక్ష్మీలావణ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. అందువల్ల మండలంలోని వీఆర్‌వోలు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ ఎవరికైనా ఇబ్బందులు కలిగితే కంట్రోల్ రూమ్‌నెంబర్ 79936 36666కు ఫోన్ చేయాలని సూచించారు.

ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటాం : ఎమ్మెల్యే

కొవ్వూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ప్రజలకు ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రజలకు, నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారన్నారు. 18వ తేదీన కాపవరం ఏఎంసీ గోడౌన్ల ప్రాంగణంలో ఏఎంసీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతు పక్షపాత ప్రభుత్వంగా తెలియజేయాలనే ఉద్దేశ్యంతో 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు చాగల్లు జూనియర్ కాలేజ్ నుంచి ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో ర్యాలీగా కాపవరం చేరుకుంటామన్నారు. సమావేశానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల అన్నదాత సుఖీభవ మొదటి విడత రూ.7 వేలు రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, నామాన పరమేశ్వరరావు, ఆళ్ల హరిబాబు, సుంకర సత్తిబాబు, డేగల రాము, మారిశెట్టి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, గారపాటి శ్రీదేవి, గారపాటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

కొవ్వూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు వర్తింపచేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు జేఏసీ చైర్మన్ నక్కా వెంకటరత్నం డిమాండ్ చేశారు. ఈనెల 12వ తేదీన బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర నివాసానికి విచ్చేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఏఎంసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలుసుకుని సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3,50,000 మంది ఔట్‌సోర్సింగ్ కుటుంబాలలో వెలుగులు నింపాలన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో హరికృష్ణ, వెంకటరాజు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి విధానంతో అధిక ఆదాయం


ప్రకృతి వ్యవసాయ ఎరువుల తయారీని వివరిస్తున్న వ్యవసాయ అధికారుల బృందం

కొవ్వూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వరిలో ఆరుతడి విధానం పాటించడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయం అదనపు ప్రాజెక్టు మేనేజర్ మహబూబ్ వలీ అన్నారు. బుధవారం ధర్మవరం, వేములూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. నిడదవోలు బయలాజికల్ కంట్రోల్ లేబొరేటరీ సహాయ సంచాలకులు పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సూడోమోనాస్ జాతులు మొక్కల వేర్లతో కలిసి జీవించి, వాటి పెరుగుదలకు అవసరమైన పోషకాలను అందిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నేరేడుమిల్లి నాగమణి, ఏవో ఏ.గంగాధర్, ఏఈవో కె.వరలక్ష్మి, జి.రూపలావణ్య, వరలక్ష్మి, అబ్బులు, గోపాలకృష్ణ, నాగదేవి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

నన్నయ విద్యార్థులు విశ్వపౌరులుగా ఎదగాలి

● జిల్లా ఎస్పీ నరసింహకిషోర్


సభికులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్

దివాన్‌చెరువు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు విశ్వపౌరులుగా ఎదగాలని ఎస్పీ నరసింహకిషోర్ అన్నారు. వర్సిటీలో జరుగుతున్న ర్యాగింగ్ నిరోధక వారోత్సవాల్లో భాగంగా బుధవారం జరిగిన కార్యక్రమానికి ఎస్పీ, వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ నన్నయ పేరుతో స్థాపించబడిన ఈ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులంతా చాలా అదృష్టవంతులన్నారు. ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ర్యాగింగ్ ఒక సంప్రదాయం కాదని, మానసిక రుగ్మతగా విద్యార్థులు గుర్తించాలన్నారు. అనంతరం మాదకద్రవ్యరహిత సమాజానికి కృషిచేస్తానని, ర్యాగింగ్‌కు పాల్పడనని ఎస్పీ సమావేశంలో ఉన్న అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, డీన్ డాక్టర్ ఎస్.ఉదయ భాస్కర్, లీగల్ అధికారి నాగేంద్రరావు విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊనగట్ల సొసైటీ అభివృద్ధే లక్ష్యం : శివనాగేంద్ర


శివనాగేంద్రకు అభినందనలు తెలుపుతున్న పలువురు నాయకులు

చాగల్లు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సొసైటీ అభివృద్ధే లక్ష్యంగాపనిచేస్తానని ఊనగట్ల సొసైటీ నూతన అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర అన్నారు. ఈయనతోపాటు సభ్యులుగా మిరియాల సతీష్, దొంగ లక్ష్మీనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన పాలకవర్గ సభ్యులను మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, టీడీపీ నాయకుడు నందిగం శ్రీనివాసరావు, సొసైటీ పరిధిలోని పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు వచ్చి అభినందనలు తెలిపారు. సొసైటీ కార్యదర్శి కే. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెరవలి: ఖండవల్లి విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ భూపతిరాజు రవి వర్మ, డైరెక్టర్లుగా మొల్లేటి శ్రీనివాస్, అనుకుల శ్రీనివాస్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పులిదిండి నాగరాజు, అతికాల రామకృష్ణ, పిప్పర రవి, సెక్రటరీ టీవీ రమణ పాల్గొన్నారు. అలాగే పెరవలి ముక్కామల సొసైటీ అధ్యక్షుడిగా వేంద్ర వెంకట రామమూర్తి, డైరెక్టర్లుగా కూనపరెడ్డి సుబ్బారావు, ఉమ్మడి దుర్గాదేవి ప్రమాణస్వీకారం చేశారు. నల్ల సురేంద్ర, రాజేష్, అబ్బిశెట్టి సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు

దేవరపల్లి సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తా

● సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు


దేవరపల్లి సొసైటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఉప్పులూరి రామారావు , పక్కన సభ్యులు

దేవరపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు పేర్కొన్నారు. బుధవారం సొసైటీ చైర్‌పర్సన్, సభ్యుల ప్రమాణస్వీకారం జరిగింది. ముందుగా చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు ఇంటి వద్ద నుంచి భారీ ర్యాలీగా తరలివస్తూ ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సొసైటీ చైర్‌పర్సన్‌గా ఉప్పులూరి రామారావు, సభ్యులుగా కవలా సీతారత్న సూర్యకుమారి, తంగెళ్ల శ్రీనివాస్, ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధితో పాటు రైతుల అభ్యున్నతికి సకాలంలో రుణాలు అందజేయడానికి కృషి చేస్తానని తెలిపారు. చైర్‌పర్సన్‌గా తనని నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు, కూటమి ప్రభుత్వానికి రామారావు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సొసైటీ అన్ని విధాలా అభివృద్ధికి కృషిచేయాలని రాంబాబుకు సూచించారు. గోపాలపురం జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను రైతులకు సొసైటీల ద్వారా అందజేసే అన్ని ప్రయోజనాలు రైతులకు అందించిన సొసైటీకి మంచి పేరు తేవాలన్నారు. కూటమి పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమర్థవంతమైన పాలనతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనంతరం చైర్‌పర్సన్ సభ్యులను సొసైటీ అధికారులు, టీడీపీ నాయకుల చైర్‌పర్సన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, కొయ్యలమూడి చినబాబు, కొయ్యలమూడి సుధారాణి, దొరయ్య, కాట్రుబీమరాజు, నందిగం శ్రీధర్, పరిమి శ్రీరామకృష్ణ, మండలంలోని పలు సొసైటీ చైర్‌పర్సన్‌లు అంద్రూ అనిల్, గన్నమని గోపాలకృష్ణ, కొడూరి వెంకటరత్నం, కూటమి నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


సీతారామస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ అమ్మిరాజు మృతి

నల్లజర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పోతవరం సీతారామస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ప్రత్తిపాటి అమ్మిరాజు (60) గుండెపోటుతో బుధవారం రాత్రి మృతిచెందారు. ఆయన నేత్రాలను కుటుంబసభ్యుల నిర్ణయం మేరకు నిడదవోలు లయన్స్ క్లబ్ ఆసుపత్రి వైద్యులు వచ్చి సేకరించారు. టీడీపీ సీనియర్ నాయకులుగా ఆయన పార్టీకి ఎంతో సేవ చేసినట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మృతిపై మాజీ సర్పంచ్ పసుమర్తి రతీష్, టీడీపీ మాజీ మం డలాధ్యక్షుడు ఏలేటి సత్యనారాయణ (జేడీ) ఎం ఎస్ బొర్రా జగన్, ప్రత్తిపాటి కృష్ణగ్రామ కమిటీ అధ్యక్షుడు ఏలేటి శ్రీనివాస్ (చక్రి) అబ్బూరి నరేష్, కొండేపాటి శేషగిరి, సురేంద్ర, పోతవరం సొసైటీ చైర్మన్ పసుమర్తి ప్రభాకర్, కొఠారి వెంకటేశ్వరరావు, గన్నమనేని వెంకటేశ్వరావు నివాళి అర్పించారు.

ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కొవ్వూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విపత్తుల పర్యవేక్షణ, ప్రజలకు తక్షణ సాయం అందించేందుకు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో డా.రాణీసుస్మిత తెలిపారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల మేరకు డివిజన్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది షిఫ్టుల వారీగా 24 గంటలూ అందుబాటులో ఉంటారన్నారు. డ్యూటీ సిబ్బంది క్రమం తప్పకుండా విధులు నిర్వహించాలన్నారు.డివిజనల్ కంట్రోల్ రూమ్ 08813-231488 ఆయా సమయాల్లో సంబంధించిన సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. 13వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు డీ.లావణ్య 7013988748, సాయంత్రం ఆరు నుంచి ఉదయం ఆరు వరకు ఎస్‌జీఎన్‌వీ కుమార్ 8500457096, ఎన్.ఫల్గుణ ఎన్‌డబ్ల్యు, 14వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు ఎం.విజయలక్ష్మి 8555049283, సాయంత్రం ఆరు నుంచి ఉదయం ఆరు వరకు డి.విజయకుమార్ 7660987689, ఎన్.ఫల్గుణ ఎన్‌డబ్ల్యు, 15వ తేదీ ఉదయం ఆరు గంటలనుంచి సాయంత్రం ఆరు వరకు వి.దీపక్ 8099023423, సాయంత్రం ఆరు నుంచి ఉదయం ఆరు వరకు ఫణి వీఆర్వో 9398069635, ఎన్.ఫల్గుణ ఎన్‌డబ్ల్యు, 16వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు ఎం.రవితేజ 9110556479, సాయంత్రం ఆరు నుంచి ఉదయం ఆరు వరకు డి.వి జయకుమార్ 76609 87689, ఎన్.ఫల్గుణ ఎన్‌డబ్ల్యు, 17వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఎస్‌జీఎన్‌వీ కుమార్ 8500457096, సాయంత్రం ఆరు నుంచి ఉదయం ఆరు వరకు ఫణి వీఆర్వో 9398069635, ఎన్.ఫల్గుణ ఎన్‌డబ్ల్యు, డివిజన్ పరిధిలోని ప్రజలు అత్యవసర పరిస్థితులలో కంట్రోల్ రూమ్‌లను సంప్రదించవచ్చు. అలాగే కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రజల సహాయార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్లు కమిషనర్ జీ.సందీప్ తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితులలో 08813-231557 నంబరును సంప్రదించవచ్చునన్నారు.

లక్ష పసుపు కొమ్ముల నోము



కొవ్వూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కుటుంబానికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆర్యవైశ్య మహిళలు సామూహిక లక్ష పసుపు కొమ్ముల నోము నిర్వహించారు. కొవ్వూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం కోట్ల ఇందిరాదేవి ఆధ్వర్యంలో 108 మంది మహిళలు శ్రీమహాలక్ష్మీదేవి, గౌరీ దేవికు సామూహిక పసుపు కొమ్ముల నోము, లలితాసహస్రనామ పారాయణం చేశారు. వేదపండితులు చల్లా శ్రీకాంత్ పర్యవేక్షణలో జరిగింది. మున్సిపల్ కమిషనర్ జీ.సందీప్, ఎంఈవో రామకిషోర్, మద్దుల వెంకటలక్ష్మి, ఉప్పల కల్యాణి, నాళం సత్యవతి, కక్కిరాల కుమారి, వలివేటి రామలక్ష్మి, బొండాడ రామలక్ష్మి, కక్కిరాల కృష్ణవేణి, మహిళలు పాల్గొన్నారు.